PRGI REGD No.: TGTEL/26/A4986

పక్కా తెలుగు

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

5 DOTS NETWORK

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 032 | ఆదివారం | 26-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Medchal Malkajigiri | Volume : 01 | Issue : 032 | Sunday | 26-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri




## చూ.. మంతర్ కాదిది...

# జెన్‌జీ జంతర్ మంతర్..!

### కాక్రోచ్ కాక రేపితే... దేశమే కదిలింది!

ఢిల్లీలోని జంతర్ మంతర్ ఎన్నో ఉద్యమాలకు వేదికైంది. కానీ ఈసారి అక్కడ మొదలైన స్వరం ఒక ప్రాంతానికో, ఒక పరీక్షకో పరిమితం కాలేదు. కోట్లాది యువత ఆవేదనకు ప్రతిధ్వనిగా మారింది. వైద్య ప్రవేశ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలు, వ్యవస్థపై పెరిగిన అనుమానాలు, భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన యువతను వీధుల్లోకి తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో వ్యంగ్యంగా మొదలైన "కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరు కొద్ది రోజుల్లోనే ప్రతిఘటనకు ప్రతీకగా మారింది. జంతర్ మంతర్‌లో ఎగిసిన నిరసన జ్వాల ఢిల్లీని దాటి దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఒకే వేదికపై చేరి న్యాయం కోసం గళమెత్తారు. లాఠీచార్జీలు, అరెస్టులు, రాజకీయ పరిణామాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి ఘటనలు ఉద్యమాన్ని మరింత వేగవంతం చేశాయి. అయితే ఈ పోరాటం ఒక్క వ్యక్తిపై కాదు, వ్యవస్థలో పారదర్శకత కోసం అన్న సందేశమే ప్రతిచోట వినిపించింది. ఇది పరీక్ష పేపర్ లీక్‌పై ఆగ్రహం మాత్రమే కాదు... శ్రమకు విలువ కావాలని, ప్రతిభకు రక్షణ కావాలని, భవిష్యత్తుతో చెలగాటం ఆపాలని జెన్‌జీ దేశానికి వినిపిస్తున్న మహాగర్జన. ఇప్పుడు దేశం ఎదుట నిలిచిన అసలు ప్రశ్న ఒక్కటే.. ఈ ఉద్యమం కాలంతో చల్లారిపోతుందా? లేక భారత విద్యా వ్యవస్థలో చారిత్రక మార్పులకు నాంది పలుకుతుందా?




# కోట్ల కల.. అప్పుల వల!

అమెరికాలో చదువు ఇప్పుడు డిగ్రీ కోసం చేసే ప్రయాణం కాదు.. అప్పులతో మొదలయ్యే సాహసం. ఒకప్పుడు ప్రతిభతో ఫండింగ్ తెచ్చుకుని చదివిన విద్యార్థుల స్థానంలో, ఇప్పుడు 40–50 లక్షల విద్యా రుణాలతో బయలుదేరుతున్న యువత పెరుగుతోంది. అమెరికా చేరిన మొదటి రోజు నుంచే చదువు కంటే పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం పోరాటం మొదలవుతోంది. ఉద్యోగానికి హామీ లేదు.. అప్పుకు మాత్రం వడ్డీ ఖాయం. రెండేళ్ల మాస్టర్స్ పూర్తయ్యే సరికి చేతిలో డిగ్రీ ఉన్నా, భుజాలపై భారీ రుణభారం మిగులుతోంది. అమెరికా డ్రీమ్ నిజమే కావచ్చు.. కానీ సరైన ప్రణాళిక, ఫండింగ్ లేకపోతే అది జీవితాన్ని అప్పుల పద్మవ్యూహంలోకి నెట్టే ప్రమాదం ఉందని ఈ కొత్త వాస్తవం హెచ్చరిస్తోంది.

దేశ రాజకీయాలను కుదిపేసిన నీట్‌యూజీ 2026 వివాదం చివరకు కేంద్ర మంత్రివర్గాన్ని తాకింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై అనుమానాలు రేకెత్తించిన ప్రశ్నపత్రం లీక్, పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా చెలరేగిన ఆగ్రహం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. జంతర్ మంతర్ వేదికగా విద్యార్థుల ఉద్యమం రోజురోజుకూ ఉధృతం కావడం, కేంద్ర విద్యాశాఖపై తీవ్ర ఒత్తిడి పెరగడం మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దేశ ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతో, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకూడదనే బాధ్యతతో ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన వెల్లడించారు. ఒకవైపు ప్రభుత్వం ఇప్పటికే సీబీఐ దర్యాప్తు, పరీక్ష రద్దు, రీఎగ్జామ్, కంప్యూటర్ ఆధారిత పరీక్షల వంటి చర్యలు చేపట్టినట్లు చెబుతుండగా, మరోవైపు ఉద్యమకారులు దీనిని తమ పోరాట విజయంగా ప్రకటించారు. ఈ రాజీనామా కేవలం ఒక మంత్రి వైదొలగడం మాత్రమే కాదు... దేశ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టే పోరాటంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిన కీలక పరిణామంగా మారింది.





# నీట్ వివాదం దెబ్బ

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఎక్స్‌లో పోస్ట్ చేసిన లేఖ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించినట్లు తెలిపారు. దేశ ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు.

**నీట్ వివాదమే ప్రధాన కారణం**

నీట్‌యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్, సీబీఎస్‌ఈ ఆన్‌స్క్రీన్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్నాయి. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతమయ్యాయి. పరీక్షల నిర్వహణలో సమూల సంస్కరణలు తీసుకురావాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. (వివరాలు 2లో..)

## ధర్మేంద్రకు కాల ధర్మం

• 1997లో విద్యార్థి నేత • 2026లో రాజీనామా మంత్రి! • తిరిగి ప్రశ్నించిన చరిత్ర

దాదాపు మూడు దశాబ్దాల క్రితం పరీక్షా పేపర్ లీక్‌పై వేలాది మంది విద్యార్థులతో కలిసి వీధుల్లో పోరాడిన యువ నాయకుడు... అదే వ్యక్తి మూడు దశాబ్దాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉండగా పరీక్షల అక్రమాల కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. 1997లో ఒడిశాలో విద్యార్థి ఉద్యమానికి ముందుండిన ధర్మేంద్ర ప్రధాన్ రాజకీయ ప్రయాణం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. (2లో..)



# 25 కాదు 21 చేయండి

## ఎమ్మెల్యే, ఎంపీ అవకాశం

- **యువతకు రాజకీయ హక్కు**
- **అసెంబ్లీలో తీర్మానం చేస్తాం**
- **సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం త్వరలో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టనుంది. ఆగస్టు తొలి వారంలో అసెంబ్లీ, శాసన మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తీర్మానం ఆమోదించి ప్రధాని నరేంద్ర మోదీకి పంపనున్నట్లు వెల్లడించారు.

**జెన్ జీకి అధిక ప్రాతినిధ్యం లక్ష్యం**

హైదరాబాద్‌లో విద్యార్థులు, యువత భారీ సమావేశంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, దేశ పాలనలో జెన్ జీకి మరింత ప్రాతినిధ్యం దక్కాలని అన్నారు. యువత ఆలోచనలు, ఆశయాలు చట్టసభల్లో ప్రతిబింబించాలంటే వారికి పోటీ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రతిపాదన యువత సాధికారతకు కీలక అడుగుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. (వివరాలు 2లో..)

## రాజీనామా విద్యార్థుల విజయం



### రాహుల్ గాంధీ సందేశం

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది దేశ విద్యా వ్యవస్థను మార్చే దిశగా తొలి పెద్ద అడుగని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా నిరసనల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, తమ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీధుల్లోకి వచ్చిన యువత గెలిచిందని అన్నారు. ఈ విజయం పూర్తిగా విద్యార్థులదేనని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

## దేశమే తొలి ప్రాధాన్యం



- **బీజేపీ సిద్ధాంతం ఇదే**
- **రాజీనామాపై బండి కామెంట్స్**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ఈ నిర్ణయం బీజేపీ సిద్ధాంతాలను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. "దేశం ముందు... పార్టీ తర్వాత... వ్యక్తిగత ప్రయోజనం చివర" అనే భావజాలాన్నే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చాటిచెప్పిందని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. (2లో..)

## రియల్ ఎస్టేట్‌పై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- **ఇందిరమ్మ టవర్స్‌కు హెల్ప్‌లైన్ ప్రారంభం**
- **తప్పుడు ప్రచారం జరుగుతోందన్న పొంగులేటి**

రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద ఉన్న అధికారిక గణాంకాలే దీనికి నిదర్శనమని చెప్పారు. ప్రజలు తప్పుడు ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదని సూచించారు.

**40 శాతం పెరిగిన ఫ్లాట్ల విక్రయాలు**

గత రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం 15 నుంచి 20 శాతం వరకు అభివృద్ధి చెందిందని మంత్రి తెలిపారు. ఫ్లాట్ల విక్రయాలు దాదాపు 40 శాతం పెరిగాయని వెల్లడించారు. గత పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ గణనీయంగా విస్తరించిందన్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల సంఖ్య పెరగడమే దీనికి స్పష్టమైన ఆధారమని వివరించారు.




**మూసీ ప్రాజెక్ట్‌కు త్వరలో టెండర్లు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో హైదరాబాద్ అభివృద్ధికి భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నామని పొంగులేటి తెలిపారు. రూ.7 వేల కోట్లతో చేపడుతున్న మూసీ సుందరీకరణ తొలి దశ 28 కిలోమీటర్ల పనులకు వారం, పది రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. రెండో దశలో రూ.24 వేల కోట్లతో 76 కిలోమీటర్ల మెట్రో విస్తరణ చేపడతామని వెల్లడించారు. త్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు కూడా సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు.

## విద్యాశాఖకు కొత్త సారథి



**జోషికి అదనపు బాధ్యతలు**

నీట్ పరీక్ష వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రపతి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించిన తర్వాత ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. పరీక్షల పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ విద్యాశాఖలో పరిపాలనా లోటు ఏర్పడకుండా కేంద్రం వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. అదనపు బాధ్యతలతో ప్రహ్లాద్ జోషి విద్యాశాఖను కూడా పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే కీలక మంత్రిత్వ శాఖను నిర్వహిస్తున్న ఆయనకు మరో ముఖ్యమైన బాధ్యత అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. (2లో..)

## యువ పోరాటం - జెన్ జీ విజయం

- **ఇదే ప్రజాస్వామ్యం**
- **హరీశ్ రావు వ్యాఖ్యలు**



బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు జెన్ జీ ఉద్యమాన్ని ప్రశంసించారు. దేశ యువత సాధించిన గొప్ప విజయమిదని పేర్కొన్నారు. యువత తలచుకుంటే వ్యవస్థలను కూడా మార్చగలదని ఇటీవల జరిగిన పరిణామాలు నిరూపించాయని అన్నారు. యువత వీరోచిత పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే యువత ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని హరీశ్ రావు అన్నారు. ప్రజల తరఫున గొంతెత్తే యువతే దేశానికి నిజమైన బలమని పేర్కొన్నారు. మార్పు కోసం పోరాడే తరం సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని చెప్పారు. యువత చైతన్యం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అభిప్రాయపడ్డారు. (వివరాలు 2లో..)

## ప్రజా శక్తి విజయం.. జెన్ జీకి మద్దతు

### ధర్మేంద్ర రాజీనామాపై కేటీఆర్ కామెంట్స్



నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాత మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన ఎక్స్ ఖాతాలో అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ గొప్పదని పేర్కొంటూ జెన్ జడ్ అని రాసుకొచ్చారు. పరీక్షలపై చర్చలు పెట్టిన ప్రభుత్వం పేపర్ లీకేజీలపై ఎందుకు స్పందించలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని నిలదీశారు. ఢిల్లీలో యువతపై జరిగిన చర్యలు బాధాకరమని పేర్కొంటూ, ఉద్యమిస్తున్న విద్యార్థులతో ప్రభుత్వం నేరుగా చర్చించి సమస్యను పరిష్కరించాల్సిందని సూచించారు.

# ధర్మేంద్రకు కాల ధర్మం



- 1997లో విద్యార్థి నేత
- 2026లో రాజీనామా మంత్రి!
- తిరిగి ప్రశ్నించిన చరిత్ర

దాదాపు మూడు దశాబ్దాల క్రితం పరీక్షా పేపర్ లీక్‌పై వేలాది మంది విద్యార్థులతో కలిసి వీధుల్లో పోరాడిన యువ నాయకుడు... అదే వ్యక్తి మూడు దశాబ్దాల తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉండగా పరీక్షల అక్రమాల కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. 1997లో ఒడిశాలో విద్యార్థి ఉద్యమానికి ముందుండిన ధర్మేంద్ర ప్రధాన్ రాజకీయ ప్రయాణం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది.

### లాఠీచార్జ్... గాయాలైనా వెనక్కి తగ్గలేదు

1997లో ఒడిశా ప్లస్2 బోర్డు పరీక్షల్లో పేపర్ లీక్ ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. భువనేశ్వర్‌లోని రాష్ట్ర సచివాలయం ఎదుట సుమారు 1,500 మంది విద్యార్థులు నిరసన చేపట్టారు. అప్పట్లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జాతీయ కార్యదర్శిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారు. అప్పటి విద్యాశాఖ మంత్రి భగబత్ ప్రసాద్ మొహంతి, ముఖ్యమంత్రి జానకీ బల్లభ్ పట్నాయక్‌లపై విద్యార్థులు జవాబుదారీతనం కోరారు. ప్రారంభంలో శాంతియుతంగా సాగిన నిరసన తర్వాత పోలీసులు లాఠీచార్జ్ నిర్వహించారు. ఆ ఘటనలో ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రంగా గాయపడ్డారని, ఆయనకు పలు ఫ్రాక్చర్లు అయ్యాయని అప్పటి ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నేతలు గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ ఆయన ఉద్యమం నుంచి వెనక్కి తగ్గకుండా విద్యార్థుల తరపున పోరాటాన్ని కొనసాగించారు.

### 2026లో అదే ప్రశ్న ధర్మేంద్ర ప్రధాన్ ముందుకు

విద్యార్థుల ఆందోళన తర్వాత ఒడిశా ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. కౌన్సిల్ ఫర్ హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ చైర్మన్, కార్యదర్శి సహా కీలక అధికారులను మార్చింది. ప్లస్2 విద్యా వ్యవస్థలో సంస్కరణలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించింది. అనంతర పరీక్షలు లీకేజీ ఆరోపణలు లేకుండానే జరిగాయని అప్పటి సంఘటనలను గుర్తు చేస్తున్నారు. 2026లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ నీట్ యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలు, పేపర్ లీక్ వివాదంపై దేశవ్యాప్తంగా విమర్శలు ఎదుర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన విద్యార్థుల ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. నిరసనల తీవ్రత పెరగడంతో చివరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించారు.

### చరిత్ర ఇచ్చిన వ్యంగ్య పాఠం

తన రాజీనామా లేఖలో దేశ యువత ఆశయాలను గౌరవిస్తున్నానని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. యువత భవిష్యత్తు గందరగోళంలో పడకూడదనే ఉద్దేశంతో బాధ్యత తీసుకున్నానని చెప్పారు. నీట్ వ్యవహారంపై ఇప్పటికే సీబీఐ దర్యాప్తు, రీఎగ్జామ్, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

1997లో పేపర్ లీక్‌పై విద్యార్థుల తరపున పోరాడిన నాయకుడు... 2026లో అదే తరహా ఆరోపణల నేపథ్యంలో మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి రావడం భారత రాజకీయాల్లో అరుదైన సంఘటనగా నిలిచింది. ఒకప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నాయకుడినే ఇప్పుడు విద్యార్థులు ప్రశ్నించడం చరిత్రలోని విస్మయకరమైన మలుపుగా మారింది. ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్నవారికి జవాబుదారీతనం ఎంత ముఖ్యమో మరోసారి గుర్తు చేసింది.

# నీట్ వివాదం దెబ్బ

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఎక్స్‌లో పోస్ట్ చేసిన లేఖ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సమర్పించినట్లు తెలిపారు. దేశ ఐక్యత దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు.



### నీట్ వివాదమే ప్రధాన కారణం

నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్, సీబీఎస్ఈ ఆన్‌స్క్రీన్ మూల్యాంకనంలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్నాయి. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు ఉద్ధృతమయ్యాయి. పరీక్షల నిర్వహణలో సమూల సంస్కరణలు తీసుకురావాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్య ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

### లేఖలో ప్రధాన్ ఏమన్నారు?

గత నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారి భవిష్యత్తు కోర్టు కేసుల్లో చిక్కుకోకూడదనే ఉద్దేశంతోనే పదవి నుంచి తప్పుకుంటున్నానని వివరించారు. దేశ వ్యతిరేక శక్తులు పరిస్థితిని దుర్వినియోగం చేసుకునే అవకాశాన్ని నివారించాలనే ఆలోచన కూడా తన నిర్ణయానికి కారణమని చెప్పారు.

### ప్రభుత్వ చర్యల ప్రస్తావన

మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు బయటపడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించిందని ప్రధాన్ గుర్తుచేశారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, పరీక్షను రద్దు చేయడం, జూన్ 21న రీఎగ్జామ్ నిర్వహించడం వంటి చర్యలు తీసుకున్నామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని కూడా వెల్లడించారు. తనపై విశ్వాసం ఉంచిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రివర్గ సహచరులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు చెప్పారు. పదవి లేకపోయినా దేశసేవే తన జీవిత లక్ష్యమని, ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షల సాధన కోసం ముందుకూ కృషి చేస్తానని పేర్కొన్నారు.

### జంతర్ మంతర్‌లో సంబరాలు

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త వెలువడగానే జంతర్ మంతర్ నిరసన శిబిరంలో సంబరాలు మొదలయ్యాయి. కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిరసనకారులను ఉద్దేశించి "మనం సాధించాం... ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు" అంటూ ప్రకటించారు. దీంతో అక్కడున్న విద్యార్థులు, ఉద్యమకారులు హర్షధ్వానాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ఈ రాజీనామాపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన చేయలేదు.

# విద్యాశాఖకు కొత్త సారథి

## జోషికి అదనపు బాధ్యతలు

### సీజేపీ ఉద్యమానికి మొదటి ఫలితం

జంతర్ మంతర్ వద్ద 35 రోజులుగా సాగిన పరీక్షల పేపర్ లీక్ వ్యతిరేక ఉద్యమం తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖలో దేశ యువత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. పరిస్థితిని దేశ వ్యతిరేక శక్తులు దుర్వినియోగం చేయకుండా ఉండాలనే ఉద్దేశంతో బాధ్యత నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేశానని కూడా వివరించారు. అభిజీత్ దిప్కే స్థాపించిన కాక్‌రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో సాగిన ఉద్యమంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే ప్రధాన డిమాండ్‌గా నిలిచింది. రాజీనామా అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూల హామీ ఇచ్చిందని ప్రకటిస్తూ ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు వెల్లడించారు.



### ముందురోజే ఇచ్చిన హెచ్చరిక

విద్యాశాఖ అదనపు బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి ముందున్న ప్రధాన సవాలు పరీక్షలపై విద్యార్థుల్లో నమ్మకం పునరుద్ధరించడం. నీట్ వివాదం తర్వాత దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. పేపర్ లీక్‌లను పూర్తిగా అరికట్టడం, పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడం, విద్యార్థుల విశ్వాసాన్ని తిరిగి పొందడం ఇప్పుడు కొత్త విద్యాశాఖ బాధ్యతల్లో అత్యంత కీలక అంశాలుగా మారాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ఒక రోజు ముందే ప్రహ్లాద్ జోషి స్పందించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. విద్యార్థులకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని చెప్పారు. అయితే సంఘ వ్యతిరేక శక్తులు ఉద్యమాన్ని దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయనే నివేదికలు ఉన్నాయని హెచ్చరించారు. అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్రం ఎలాంటి రాజీ పడదని కూడా ఆయన స్పష్టం చేశారు.

# రాజీనామా విద్యార్థుల విజయం

- రాహుల్ గాంధీ సందేశం

### విద్యా వ్యవస్థపై విమర్శలు

భారత విద్యా వ్యవస్థ ఒకప్పుడు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. గత కొన్నేళ్లుగా ఆ వ్యవస్థపై దాడులు జరిగాయని ఆరోపించారు. విద్యను క్రమంగా ప్రైవేటీకరణ దిశగా నడిపించారని విమర్శించారు. నిరుద్యోగ సమస్య, పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలపై పేరుకుపోయిన అసంతృప్తే ఈ ఉద్యమానికి కారణమని పేర్కొన్నారు. విద్యార్థుల పోరాటం దేశ భవిష్యత్తును కాపాడే ఉద్యమంగా మారిందన్నారు.

### ఇంకా రెండు డిమాండ్లు

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పోరాటం ముగియలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 20న పార్లమెంట్ మార్చ్ సందర్భంగా జరిగిన పోలీసు చర్యపై పూర్తి విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని కోరారు. విద్యార్థులపై చేయి చేసుకున్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలని అన్నారు.

### మోదీ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్

విద్యార్థులపై జరిగిన ఘటనల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. భారత యువతకు గౌరవ సూచకంగా ఈ చర్య తీసుకోవాలని అన్నారు. విద్యార్థులపై జరిగిన



వ్యవహారాన్ని ప్రభుత్వం సమర్థించకూడదని సూచించారు. బాధిత విద్యార్థుల మనోభావాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.

### ప్రతిపక్ష పోరాటం కొనసాగింపు

నీట్ వివాదంపై పార్లమెంట్‌లో ప్రతిపక్షం నిరంతరం ప్రభుత్వాన్ని నిలదీస్తోందని రాహుల్ గాంధీ గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ప్రధానమంత్రి నివాసం వద్ద కూడా నిరసన చేపట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పేపర్ లీక్ కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడం, చట్టాలను కఠినతరం చేయడం, పరీక్షల నిర్వహణ సంస్థ ఎన్‌టీఏలో 47 మంది అధికారులను తొలగించడం వంటి చర్యలు ప్రకటించింది. అయినప్పటికీ విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్షం స్పష్టం చేస్తోంది.

# రియల్ ఎస్టేట్‌పై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

- ఇందిరమ్మ టవర్స్‌కు హెల్ప్‌లైన్ ప్రారంభం
- తప్పుడు ప్రచారం జరుగుతోందన్న పొంగులేటి

### భూభారతి చట్టంతో భూములకు భరోసా

ప్రజల భూములకు పూర్తి రక్షణ కల్పించడమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో ఉన్న చిన్న సమస్యలను 15 నుంచి 20 రోజుల్లో పరిష్కరించి సేవలను మరింత సులభతరం చేస్తామని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సమయానికి ఫ్లాట్లు అందించి వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు.

### ఇందిరమ్మ టవర్స్‌కు హెల్ప్‌లైన్

ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్ 04024603572ను మంత్రి ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు. మధ్యవర్తులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

### ఆధార్ చాలు.. యూపీఐతోనే చెల్లింపు

దరఖాస్తు సమయంలో ఆధార్ నంబర్ ఒక్కటే సరిపోతుందని మంత్రి వెల్లడించారు. ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. రూ.10 వేల ఈఎండీని యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని సూచించారు. ఫ్లాట్ రాకపోతే అదే ఖాతాకు మొత్తం తిరిగి జమ అవుతుందని హామీ ఇచ్చారు. క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న, వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్న కుటుంబాలు అర్హులని తెలిపారు.

### మొదటి విడతలో 7,680 ఇళ్లు

మొదటి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడుతుందని వివరించారు. ఫ్లాట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్య ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు 20 నుంచి 25 గజాల అన్‌డివైడెడ్ షేర్‌ను లబ్ధిదారుడి పేరుపై నమోదు చేస్తుందని చెప్పారు. లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.



# దేశమే తొలి ప్రాధాన్యం

- బీజేపీ సిద్ధాంతం ఇదే
- రాజీనామాపై బండి కామెంట్స్

### మోదీ నాయకత్వంలో బాధ్యతకు ప్రాధాన్యం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం అంటే ప్రజల స్వరాన్ని వినడం అని బండి సంజయ్ అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించడం, అవసరమైన సమయంలో బాధ్యత తీసుకోవడం బీజేపీ సంస్కృతిలో భాగమని చెప్పారు. పదవి కంటే బాధ్యత గొప్పదనే విలువలను ధర్మేంద్ర ప్రధాన్ తన నిర్ణయంతో మరోసారి నిరూపించారని వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజకీయ ప్రయాణాన్ని కూడా బండి సంజయ్ గుర్తు చేశారు. విద్యార్థి ఉద్యమాలతో ప్రజాజీవితాన్ని ప్రారంభించి, దశాబ్దాల పాటు ప్రజాసేవలో కొనసాగారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలో పలు కీలక బాధ్యతలను సమర్థంగా నిర్వహించి దేశాభివృద్ధికి సేవలందించారని కొనియాడారు. ఆయన సేవలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఇదే బీజేపీ... ఇదే ప్రజాస్వామ్యం

"ఇదే బీజేపీ... ఇదే ప్రజాస్వామ్యం... దేశమే ఎప్పుడూ మొదటి ప్రాధాన్యం" అంటూ బండి సంజయ్ తన సందేశాన్ని ముగించారు. పదవుల కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవడమే బీజేపీ ప్రత్యేకత అని స్పష్టం చేశారు. బాధ్యతాయుత రాజకీయాలకు ఈ రాజీనామా నిదర్శనమని అభిప్రాయపడ్డారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ధర్మేంద్ర



ప్రధాన్ శనివారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామాలపై గత కొన్ని రోజులుగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని చెప్పారు. ఇది వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన అంశం కాదని స్పష్టం చేస్తూ తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి సమర్పించారు. రాజీనామా అనంతరం బీజేపీ నాయకత్వం నుంచి వచ్చిన తొలి ప్రధాన స్పందనల్లో బండి సంజయ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# యువ పోరాటం




- జెన్ జీ విజయం
- ఇదే ప్రజాస్వామ్యం
- హరీశ్ రావు వ్యాఖ్యలు

బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు జెన్ జీ ఉద్యమాన్ని ప్రశంసించారు. దేశ యువత సాధించిన గొప్ప విజయమిదని పేర్కొన్నారు. యువత తలచుకుంటే వ్యవస్థలను కూడా మార్చగలదని ఇటీవల జరిగిన పరిణామాలు నిరూపించాయని అన్నారు. యువత వీరోచిత పోరాటం వల్లే కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే యువత ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని హరీశ్ రావు అన్నారు. ప్రజల తరఫున గొంతెత్తే యువతే దేశానికి నిజమైన బలమని పేర్కొన్నారు. మార్పు కోసం పోరాడే తరం సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని చెప్పారు. యువత చైతన్యం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అభిప్రాయపడ్డారు.

### ఏఐ కంటే మానవత్వమే గొప్పది

ప్రపంచ జ్ఞానం ఇప్పుడు యువత అరచేతిలో ఉందని హరీశ్ రావు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలదని, కానీ మానవత్వంతో కూడిన ఆలోచన మాత్రమే సామాజిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపగలదని వివరించారు. సాంకేతికత ఎంత పెరిగినా మానవ విలువలకు ప్రత్యామ్నాయం ఉండదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఫాలోవర్ల సంఖ్య చూసి నాయకత్వాన్ని అంచనా వేయొద్దని హరీశ్ రావు సూచించారు. నిజమైన నాయకుడికి ఉండాల్సిన అతిపెద్ద అర్హత వ్యక్తిత్వమని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రతి ఫైలు వెనుక ఒక కుటుంబం, ఒక మనిషి జీవితం ఉంటుందనే బాధ్యత ప్రజాప్రతినిధులకు ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారుతాయని, పదవులు మారుతాయని, కానీ ప్రజలకు చేసిన సేవ మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. యువత ప్రేక్షకులుగా కాకుండా బాధ్యతగల పౌరులుగా దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం కాదు, సేవ కోసం నాయకులుగా ఎదగాలని సూచించారు.

# 25 కాదు 21 చేయండి

## ఎమ్మెల్యే, ఎంపీ అవకాశం

- యువతకు రాజకీయ హక్కు
- అసెంబ్లీలో తీర్మానం చేస్తాం
- సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదన

### అసెంబ్లీలో తీర్మానం తీసుకురానున్న ప్రభుత్వం

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక రాజకీయ నిర్ణయాన్ని ప్రకటించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం త్వరలో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టనుంది. ఆగస్టు తొలి వారంలో అసెంబ్లీ, శాసన మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తీర్మానం ఆమోదించి ప్రధాని నరేంద్ర మోదీకి పంపనున్నట్లు వెల్లడించారు.

### జెన్ జీకి అధిక ప్రాతినిధ్యం లక్ష్యం

హైదరాబాద్‌లో విద్యార్థులు, యువత భారీ సమావేశంలో మాట్లాడిన రేవంత్ రెడ్డి, దేశ పాలనలో జెన్ జీకి మరింత ప్రాతినిధ్యం దక్కాలని అన్నారు. యువత ఆలోచనలు, ఆశయాలు చట్టసభల్లో ప్రతిబింబించాలంటే వారికి పోటీ చేసే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రతిపాదన యువత సాధికారతకు కీలక అడుగుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

### 21 ఏళ్లకే ఐఏఎస్.. ఎమ్మెల్యే ఎందుకు కాదు?

21 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులుగా ఎంపిక కావచ్చని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అదే




వయస్సులో మేయర్, జడ్పీ చైర్మన్ వంటి స్థానాలకు పోటీ చేసే అవకాశం ఇప్పటికే ఉందని చెప్పారు. అలాంటి యువత ఎమ్మెల్యే, ఎంపీగా ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. జర్మనీ, బ్రిటన్, సింగపూర్ వంటి దేశాల్లో యువతకు ఎక్కువ రాజకీయ అవకాశాలు ఉన్నాయని ఉదాహరణలు చూపించారు.

### నాడు రాజీవ్ గాంధీ సంస్కరణలు

యువతకు ఓటు హక్కు విస్తరణలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన రాజ్యాంగ సవరణను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం యువ భారత స్వరానికి గుర్తింపుగా నిలిచిందన్నారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు తీసుకొచ్చిన 73వ, 74వ రాజ్యాంగ సవరణల వల్ల 21 ఏళ్ల యువత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం పొందిందని వివరించారు. ఈ తీర్మానం ఆమోదం పొందిన తర్వాత తాను స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి రాజ్యాంగ సవరణ కోరతానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. పార్లమెంట్‌లో కూడా కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తుతుందని చెప్పారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మద్దతు కూడగట్టి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని వెల్లడించారు.

### నీట్ ఉద్యమానికి మద్దతు

నీట్ వివాదంపై జరిగిన జెన్ జీ ఉద్యమాన్ని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. విద్యార్థుల నిరసనల వల్లే కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కూడా ఆ ఉద్యమ ఫలితమేనని అన్నారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు తగిన న్యాయం, పరిహారం అందించాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**ఢిల్లీలోని జంతర్ మంతర్ ఎన్నో ఉద్యమాలకు వేదికైంది. కానీ ఈసారి అక్కడ మొదలైన స్వరం ఒక ప్రాంతానికో, ఒక పరీక్షకో పరిమితం కాలేదు. కోట్లాది యువత ఆవేదనకు ప్రతిధ్వనిగా మారింది. వైద్య ప్రవేశ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలు, వ్యవస్థపై పెరిగిన అనుమానాలు, భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళన యువతను వీధుల్లోకి తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో వ్యంగ్యంగా మొదలైన "కాక్రోచ్ జనతా పార్టీ (CJP)" అనే పేరు కొద్ది రోజుల్లోనే ప్రతిఘటనకు ప్రతీకగా మారింది. జంతర్ మంతర్‌లో ఎగిసిన నిరసన జ్వాల ఢిల్లీని దాటి దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఒకే వేదికపై చేరి న్యాయం కోసం గళమెత్తారు. లాఠీచార్జీలు, అరెస్టులు, రాజకీయ పరిణామాలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి ఘటనలు ఉద్యమాన్ని మరింత వేగవంతం చేశాయి. అయితే ఈ పోరాటం ఒక్క వ్యక్తిపై కాదు, వ్యవస్థలో పారదర్శకత కోసం అన్న సందేశమే ప్రతిచోట వినిపించింది. ఇది పరీక్ష పేపర్ లీక్‌పై ఆగ్రహం మాత్రమే కాదు... శ్రమకు విలువ కావాలని, ప్రతిభకు రక్షణ కావాలని, భవిష్యత్తుతో చెలగాటం ఆపాలని జెన్‌జీ దేశానికి వినిపిస్తున్న మహాగర్జన. ఇప్పుడు దేశం ఎదుట నిలిచిన అసలు ప్రశ్న ఒక్కటే—ఈ ఉద్యమం కాలంతో చల్లారిపోతుందా? లేక భారత విద్యా వ్యవస్థలో చారిత్రక మార్పులకు నాంది పలుకుతుందా?**



# చూ.. మంతర్ కాదిది జెన్‌జీ జంతర్ మంతర్

## కాక్రోచ్ కాక రేపితే... దేశమే కదిలింది!

నిన్నటి వరకు అది ఢిల్లీలోని జంతర్ మంతర్ మాత్రమే. నిరసనలకు చిరునామా. నినాదాలకు నిలయం. ప్రజాస్వామ్యానికి ప్రతీక. కానీ ఈ రోజు... ఆ పేరు ఒక ప్రదేశం కాదు, ఒక ప్రవాహం. ఒక వీధి కాదు, ఒక వేదన. ఒక నగరం కాదు, ఒక దేశం. ఇరుకు సందుల నుంచి ఐకానిక్ వీధుల దాకా... అలహాబాద్ నుంచి ముంబై వరకు... నాసిక్ నుంచి అహ్మదాబాద్ వరకు... పాట్నా నుంచి మిజోరం వరకు... ఒక్కటే మంట. ఒక్కటే నినాదం. ఒక్కటే ప్రశ్న. జంతర్ మంతర్‌లో వెలిగిన చిన్న రవ్వ, దేశమంతా కమ్ముకున్న అగ్నిజ్వాలగా మారింది. మొదట అది కొద్దిమంది విద్యార్థుల గొంతు. తర్వాత వేలమంది యువత గర్జన. ఇప్పుడు అది తరాల ఆవేదన. ఒక పరీక్షలో జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ మొదలైన స్వరం, క్రమంగా వ్యవస్థనే నిలదీస్తున్న ఉద్యమంగా రూపాంతరం చెందింది. ఇది కేవలం ఒక పరీక్ష గురించి కాదు. ఒక ప్రశ్నాపత్రం గురించి కాదు. ఇది ఒక తరం నమ్మకం గురించి. అవకాశాల కోసం అహర్నిశలు శ్రమించిన యువత భవిష్యత్తు గురించి. శ్రమకు విలువ ఉంటుందా? నిజాయితీకి న్యాయం దొరుకుతుందా? అనే ప్రశ్నల గురించి.

**నిశ్శబ్దం వీడి గర్జించిన జెన్‌జీ యువత**

చరిత్రలో ప్రతి విప్లవం ఒక చిన్న ప్రశ్నతోనే మొదలైంది. ఒక రోజు ఆ ప్రశ్న లక్షల గొంతులుగా మారింది. ఈ రోజు కూడా అదే జరుగుతోంది. నిన్న వరకూ నిశ్శబ్దంగా తలవంచిన విద్యార్థి, ఈ రోజు తలెత్తి ప్రశ్నిస్తున్నాడు. నిన్న వరకూ పరీక్ష కోసం చదివిన చేతులు, ఈ రోజు న్యాయం కోసం ప్లకార్డులు ఎత్తుతున్నాయి. భయపడిన కళ్లలో ఇప్పుడు ధైర్యం కనిపిస్తోంది. మౌనంగా మిగిలిన పెదవులపై ఇప్పుడు నినాదాలు వినిపిస్తున్నాయి.

ఇది కేవలం నిరసన కాదు. ఇది ఒక తరం తన ఉనికిని ప్రకటిస్తున్న క్షణం. అవకాశాలను కొందరి సొత్తుగా మార్చే వ్యవస్థలపై విసిరిన సవాలు. "మా శ్రమను అవమానించొద్దు... మా భవిష్యత్తుతో ఆటలాడొద్దు..." అని వినిపిస్తున్న గర్జన. ప్రతి అడుగూ ఒక ప్రశ్న. ప్రతి నినాదం ఒక తీర్పు. ప్రతి కన్నీటి బొట్టు ఒక చరిత్ర. నగరం దాటిన ఈ మంట ఇప్పుడు రాష్ట్రాలను దాటుతోంది. భాషలు మారినా బాధ ఒక్కటే. ప్రాంతాలు మారినా ప్రశ్న ఒక్కటే. మతాలు మారినా ఆకాంక్ష ఒక్కటే. న్యాయం కావాలి. జవాబుదారీతనం కావాలి. యువత కలలకు రక్షణ కావాలి. అందుకే ఈ ఉద్యమం కేవలం ఒక నగరంలో చిక్కుకుపోలేదు. దేశం నలుమూలలా వ్యాపించింది. ఒక్కో వీధి ఒక వేదికైంది. ఒక్కో విద్యార్థి ఒక ఉద్యమమయ్యాడు.

**చిన్న స్వరం... దేశాన్ని కదిలించిన గర్జన**

ఇప్పుడు దేశం ఎదుట నిలిచిన ప్రశ్న ఒక్కటే—ఇది ఒక సాధారణ నిరసన మాత్రమేనా? లేక దశాబ్దాల తర్వాత భారతదేశం చూస్తున్న మరో మహా విద్యార్థి చైతన్యానికి ఇది ఆరంభమా? ఈ జ్వాల కాలంతో ఆరిపోతుందా? లేక వ్యవస్థలను మార్చే వెలుగుగా మారుతుందా? సమాధానం కాలమే చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. జంతర్ మంతర్‌లో మొదలైన ఆ చిన్న స్వరం ఇప్పుడు దేశ మనస్సాక్షిని మేల్కొలిపే మహాగర్జనగా మారింది. చరిత్రలో కొన్ని ఉద్యమాలు విజయంతో గుర్తుండిపోతాయి. మరికొన్ని మనిషికి ప్రశ్నించడం నేర్పినందుకు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఈ ఉద్యమం ఏ కోవలో నిలుస్తుందో రాబోయే రోజులు నిర్ణయిస్తాయి. కానీ ఒక తరం తన గొంతును దేశానికి వినిపించిన క్షణంగా మాత్రం ఇది తప్పకుండా గుర్తుండిపోతుంది. భారతదేశంలో వైద్య విద్య కేవలం ఒక కోర్సు కాదు; అది లక్షలాది కుటుంబాల కల. రైతు అమ్మిన ఎకరం, కూలీ తల్లి దాచుకున్న ప్రతి రూపాయి, మధ్య తరగతి కుటుంబం చేసిన త్యాగం, విద్యార్థి ఎన్నో సంవత్సరాల కఠోర సాధన—ఇవన్నీ చివరకు ఒకే పరీక్షలో తమ భవిష్యత్తును వెతుకుతాయి. అలాంటి పరీక్షపై పేపర్ లీక్ ఆరోపణలు రావడం, పరీక్షను రద్దు చేయడం, మళ్లీ నిర్వహించడం వంటి పరిణామాలు యువతలో తీవ్ర అసంతృప్తిని రగిలించాయి. అది కేవలం ఒక పరీక్షపై కోపం కాదు... వ్యవస్థపై నమ్మకం దెబ్బతిన్నదనే బాధ.

**అవమానం నుంచి ఎగిరిన ఆత్మగౌరవ జెండా**

అలాంటి సమయంలో మరో సంఘటన ఉద్యమానికి కొత్త రూపాన్ని ఇచ్చింది. "కాక్రోచ్" అనే పదం సాధారణంగా అవమానాన్ని సూచిస్తుంది. కానీ చరిత్రలో అవమానంగా విసిరిన పదాలను ప్రజలు గౌరవ చిహ్నాలుగా మార్చుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2026లో కూడా అదే జరిగింది. కాక్రోచ్ జనతా పార్టీ (CJP)" అనే పేరుతో ప్రారంభమైన ఒక వేదిక మొదట సోషల్ మీడియాలో వ్యంగ్యంగా కనిపించినా, కొద్ది రోజుల్లోనే అది విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఒకే గొంతుతో మాట్లాడే ఉద్యమంగా మారింది. ఒక పదం ప్రతిఘటనకు ప్రతీకగా మారింది. ఒక అవమానం ఆత్మగౌరవానికి జెండాగా ఎగిరింది. జంతర్ మంతర్ భారత ప్రజాస్వామ్యానికి కొత్త కాదు. అక్కడ రైతులు నిలబడ్డారు. ఉద్యోగార్థులు నిలబడ్డారు. మహిళలు, కార్మికులు, పౌరహక్కుల కోసం పోరాడిన వారు నిలబడ్డారు. కానీ ఈసారి అక్కడ నిలబడింది ఒక తరం. వారి చేతుల్లో జాతీయ జెండా ఉంది. వారి కళ్లలో కోపం కంటే బాధ ఎక్కువగా ఉంది. వారి నినాదాల్లో రాజకీయాల కంటే న్యాయం కోసం వినిపించిన వేడిక ఎక్కువగా ఉంది. "మేము పరీక్ష రాశాం... మోసం చేయలేదు... అయితే శిక్ష ఎందుకు మాకే?" అనే ప్రశ్న ఒక్కసారిగా దేశవ్యాప్తంగా వినిపించింది.

**హ్యాష్‌ట్యాగ్‌లే ఉద్యమానికి కొత్త ఆయుధం**

ఈ ఉద్యమంలో మరో విశేషం కనిపించింది. నాయకుల పిలుపు కంటే సోషల్ మీడియా పిలుపు బలంగా పనిచేసింది. సభల కంటే మొబైల్ స్క్రీన్‌లు పెద్ద వేదికలయ్యాయి. హ్యాష్‌ట్యాగ్‌లు నినాదాలుగా మారాయి. వీడియోలు నిరసనలకు పిలుపునిచ్చాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా యువత ఒక సమస్య చుట్టూ ఐక్యమైంది. ఈ తరానికి నాయకుడు కంటే నెట్‌వర్క్ ముఖ్యం. సిద్ధాంతం కంటే పారదర్శకత ముఖ్యం. ప్రచారం కంటే జవాబుదారీతనం ముఖ్యం. అదే ఈ ఉద్యమానికి కొత్త శక్తిని ఇచ్చింది. ఈ దశలో సోనమ్ వాంగ్‌చుక్ ఉద్యమంలో చేరడం మరో మలుపు అయింది. పర్యావరణం, హిమాలయాల పరిరక్షణ, విద్యా సంస్కరణలపై సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆయన చేపట్టిన నిరాహార దీక్ష ఉద్యమాన్ని జాతీయ చర్చగా మార్చింది. ఆయన ప్రవేశంతో ఈ పోరాటం కేవలం పరీక్షకు పరిమితం కాలేదు. విద్యా వ్యవస్థపై, పాలనపై, ప్రజాస్వామ్యంలో యువత స్థానంపై చర్చ మొదలైంది. ప్రభుత్వం, నిరసనకారుల మధ్య చర్చలు జరిగాయి. హామీలు వచ్చాయి. కానీ ఉద్యమం అప్పటికే దేశ మనస్సాక్షిని మేల్కొలిపింది. ఉద్యమాల చరిత్ర చెబుతోంది—కొన్ని నినాదాలతో పెద్దవవుతాయి, కొన్ని రక్తంతో పెద్దవవుతాయి, మరికొన్ని లాఠీ దెబ్బలతో మరింత బలపడతాయి. ఢిల్లీలో జరిగిన పోలీసు చర్యలపై వచ్చిన విమర్శలు కూడా ఈ ఉద్యమాన్ని మరింత విస్తరించాయి. నిరసనలను అణచివేయాలనే ప్రతి ప్రయత్నం మరో నగరంలో కొత్త నిరసనకు కారణమైంది. జంతర్ మంతర్‌లో మొదలైన జ్వాల దేశమంతా వ్యాపించింది.

**మంత్రి కాదు... మారాల్సింది వ్యవస్థ**

ఈ పరిణామాల మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించడం ఉద్యమానికి కీలక ఘట్టంగా నిలిచింది. రాజకీయంగా అది ఒక పెద్ద సందేశాన్ని ఇచ్చింది—యువత స్వరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ఇక సాధ్యం కాదని. అయితే ఉద్యమంలో పాల్గొన్న చాలామంది విద్యార్థులు ఒక విషయం స్పష్టంగా చెప్పారు. "మాకు ఒక వ్యక్తిపై కోపం లేదు... వ్యవస్థపై ప్రశ్న ఉంది." ఈ మాటే మొత్తం ఉద్యమానికి సారాంశం. ఎందుకంటే ఒక మంత్రి మారడం కంటే, ఒక వ్యవస్థ మారడమే వారి లక్ష్యం. ఈ ఉద్యమం భారత ప్రజాస్వామ్యానికి కొన్ని గొప్ప పాఠాలు నేర్పింది. పరీక్షలు కేవలం మార్కులు కావని, అవి కోట్ల కుటుంబాల ఆశలని గుర్తు చేసింది. పారదర్శకత లేకపోతే ప్రతిభ కూడా అనుమానాస్పదమవుతుందని చూపించింది. సోషల్ మీడియా ఇప్పుడు కేవలం వినోదానికి మాత్రమే కాదు, సామాజిక మార్పుకు కూడా వేదికగా మారిందని నిరూపించింది. ముఖ్యంగా, యువతను తక్కువ అంచనా వేయడం ఏ ప్రభుత్వానికైనా ప్రమాదకరమని స్పష్టం చేసింది.

**ప్రశ్నించిన విద్యార్థే నిజమైన హీరో**

చరిత్రలో ప్రతి ఉద్యమానికి ఒక ముఖం ఉంటుంది. కానీ కొన్ని ఉద్యమాలకు ముఖం ఉండదు... ఒక తరం ఉంటుంది. ఈ పోరాటంలోనూ అసలు హీరో ఎలాంటి రాజకీయ నాయకుడు కాదు, ఏ సంస్థ కాదు. న్యాయం కోసం గొంతెత్తిన విద్యార్థి, తన బిడ్డ భవిష్యత్తు కోసం ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాపాడిన ప్రతి పౌరుడే ఈ ఉద్యమానికి నిజమైన బలం. జంతర్ మంతర్‌లో మొదలైన నినాదం దేశవ్యాప్తంగా ప్రతి పరీక్షా కేంద్రంలో, ప్రతి కోచింగ్ హాస్టల్‌లో, ప్రతి యువ హృదయంలో ప్రతిధ్వనించింది. ఇది ఒక పరీక్షకు పరిమితమైన ఆందోళన కాదు... ప్రతిభపై విశ్వాసాన్ని కాపాడుకోవాలనే సమాజ సంకల్పం. ఈ ఉద్యమం ఒక విషయాన్ని స్పష్టం చేసింది—పరీక్షల్లో పారదర్శకత లేకపోతే ప్రతిభపై నమ్మకం దెబ్బతింటుంది, యువత ఆశలు కూలిపోతాయి. ప్రభుత్వాలు మారడం కంటే వ్యవస్థలు మారడమే ప్రజాస్వామ్యానికి అసలైన విజయం. అందుకే ఈ పోరాటం ఒక సంఘటనగా కాదు, ఒక హెచ్చరికగా గుర్తుండిపోతుంది. యువత స్వరాన్ని విస్మరించే వ్యవస్థ ఎంత బలమైనదైనా చివరికి ప్రజల ప్రశ్నల ముందే నిలబడాల్సి వస్తుంది. చరిత్ర చివరకు పేపర్ లీక్ తేదీని మాత్రమే కాదు, ఆ అన్యాయాన్ని ఎదుర్కొంటూ ఒక తరం ఎలా నిలబడిందో కూడా గుర్తుంచుకుంటుంది. భారత ప్రజాస్వామ్యానికి ఈ ఉద్యమం చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే—ప్రశ్నించే పౌరులే దేశ భవిష్యత్తును కాపాడే అసలైన శక్తి.

**ఇంకా చాలా ఉంది!**

**1. జంతర్ మంతర్ నుంచి దేశవ్యాప్త జ్వాల**

**ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ప్రారంభమైన విద్యార్థుల నిరసన దేశవ్యాప్తంగా విస్తరించింది. ఒక పరీక్షపై మొదలైన ఆందోళన క్రమంగా యువత భవిష్యత్తు, పారదర్శకత, అవకాశాల సమానత్వంపై దేశవ్యాప్త ఉద్యమంగా మారి ప్రతి రాష్ట్రంలో ప్రతిధ్వనించింది.**

**2. 'కాక్రోచ్' నుంచి ప్రతిఘటనకు ప్రతీక**

**వ్యంగ్యంగా వినిపించిన "కాక్రోచ్ జనతా పార్టీ.. సీజేపీ" పేరు కొద్ది రోజుల్లోనే యువత పోరాటానికి గుర్తుగా మారింది. అవమానంగా విసిరిన పదాన్నే ఉద్యమకారులు ఆత్మగౌరవానికి చిహ్నంగా మలిచి సోషల్ మీడియా ద్వారా దేశమంతా విస్తరించారు.**

**3. పరీక్ష కాదు... వ్యవస్థపై ప్రశ్న**

**పేపర్ లీక్ ఆరోపణలు, పరీక్షల నిర్వహణపై వివాదాలు యువతలో తీవ్ర ఆవేదన రేకెత్తించాయి. "మేము కష్టపడ్డాం... తప్పు చేయలేదు... శిక్ష ఎందుకు మాకే?" అనే ప్రశ్నతో విద్యార్థులు వ్యక్తులపై కాదు, మొత్తం వ్యవస్థలో పారదర్శకత కోరుతూ ఉద్యమాన్ని కొనసాగించారు.**

**4. సోషల్ మీడియా ఉద్యమానికి ఇంధనం**

**హ్యాష్‌ట్యాగ్‌లు, వీడియోలు, డిజిటల్ ప్రచారం ఉద్యమానికి అపూర్వ బలం ఇచ్చాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలు ఒకే వేదికపై చేరి న్యాయం కోసం దేశవ్యాప్తంగా నిరసనలను మరింత విస్తరించారు.**

**5. రాజీనామాతో ముగియని ఉద్యమం**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఉద్యమంలో కీలక మలుపు అయినప్పటికీ, విద్యార్థులు తమ లక్ష్యం ఒక వ్యక్తి మార్పు కాదని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో శాశ్వత సంస్కరణలు, పారదర్శకత, జవాబుదారీతనమే అసలు విజయమని ఉద్యమం చాటిచెప్పింది.**



# డిక్టేటర్లు పోయారు

- విద్యార్థుల సంబరాలు
- మార్మోగిన జంతర్ మంతర్

నీట్ ప్రశ్నాపత్రం లీక్ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ ఒక్కసారిగా సంబరాల వేదికగా మారింది. వేలాది మంది నిరసనకారులు "నియంత ఓడిపోయాడు" అంటూ నినాదాలు చేశారు. త్రివర్ణ పతాకాలను ఊపుతూ పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. వేదికపై నృత్యాలు చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజీనామా తమ ఉద్యమ విజయమని నిరసనకారులు ప్రకటించారు.

**కాక్రోచ్ జనతా పార్టీ వేడుకలు**

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే వేదికపైకి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి ఏ.ఆర్. రెహమాన్ ఆలపించిన "వందే మాతరం" పాటను పాడారు. మరోవైపు "చక్ దే ఇండియా" పాటకు యువత నృత్యాలు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలను చేతబట్టి పలువురు నిరసనకారులు విజయోత్సాహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పోరాటం ఫలితమే ఈ రాజీనామా అని వేదికపై పలువురు పేర్కొన్నారు. అభిజీత్ దిప్కే మాట్లాడుతూ ప్రభుత్వం రాజీనామాలు చూడదని చెప్పేవారని, ఇప్పుడు ప్రజల ఉద్యమం ముందు తలవంచాల్సి వచ్చిందని అన్నారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత పోరాటం ఎంత శక్తివంతమో ఈ పరిణామం నిరూపించిందని వ్యాఖ్యానించారు. ప్రజలు ఐక్యంగా నిలిస్తే ఏ ప్రభుత్వాన్నైనా నిర్ణయం మార్చేలా చేయవచ్చని చెప్పారు.

**పోరాటం ఇంకా ముగియలేదన్న దిప్కే**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం ముగిసిపోలేదని దిప్కే స్పష్టం చేశారు. నీట్ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై 20న జరిగిన నిరసనల్లో పోలీసుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించారు.

**కాక్రోచ్ వ్యాఖ్యపై ఘాటు స్పందన**

భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన "కాక్రోచ్" వ్యాఖ్యను ప్రస్తావిస్తూ అభిజీత్ దిప్కే భావోద్వేగ ప్రసంగం చేశారు. ఆ వ్యాఖ్య లేకపోతే తాను భారత్‌కు తిరిగి వచ్చేవాడిని కాదన్నారు. దేశ యువత వీధుల్లోకి వచ్చేది కాదన్నారు. అదే ఉద్యమానికి బలంగా మారి చివరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిందని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలకు సభలో హర్షధ్వానాలు వినిపించాయి.

**వేలాదిగా తరలివచ్చిన ప్రజలు**

రాజీనామా వార్త బయటకు వచ్చిన తర్వాత జంతర్ మంతర్ వద్దకు ప్రజల రాక మరింత పెరిగింది. ప్రవేశ ద్వారాల వద్ద భారీ క్యూలు కనిపించాయి. భద్రతను కట్టుదిట్టం చేసినా ఉద్యమకారుల ఉత్సాహం తగ్గలేదు. "పోరాటం ఇంకా కొనసాగుతుంది... తదుపరి లక్ష్యం ఈ20" అంటూ నినాదాలు వినిపించాయి. ముంబై నుంచి వచ్చిన 12వ తరగతి విద్యార్థిని వృతికా మాట్లాడుతూ విద్యా సంస్కరణలపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఉద్యమం కొనసాగాలని కోరింది. విద్య హక్కును కాపాడుకోవడానికే తాను ఢిల్లీకి వచ్చానని తెలిపింది. ద్రవ్యోల్బణం, ఆర్థిక ఇబ్బందులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడింది.

# ఇన్‌స్టాగ్రామ్ విప్లవం

- రీల్స్‌తో రాసిన చరిత్ర
- జెన్‌జీ ఉద్యమానికి కొత్త ఊపు!

జంతర్ మంతర్‌లో సాగిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం కేవలం రోడ్లపై జరిగిన నిరసనగా మాత్రమే నిలవలేదు. సోషల్ మీడియా వేదికగా కోట్లాది మందిని చేరుకున్న డిజిటల్ ఉద్యమంగా మారింది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ఈ పోరాటానికి ప్రధాన ఆయుధంగా నిలిచింది. జెన్‌జీ యువత తమ ఫోన్లను కెమెరాలుగా, ఆధారాలుగా, ప్రచార సాధనాలుగా మార్చి ఉద్యమాన్ని దేశమంతా విస్తరించింది. దీంతో జంతర్ మంతర్‌లో ఉన్నవారితో పాటు అక్కడికి రాని లక్షల మంది కూడా ఈ ఉద్యమంలో భాగమయ్యారు.



**రీల్స్‌తో ఉద్యమానికి ఊపు**

జెన్‌జీ యువత నిరసనను సంప్రదాయ పద్ధతిలో కాకుండా కొత్త శైలిలో ప్రపంచానికి చూపించింది. "జంతర్ మంతర్‌కు వెళ్తున్నాను", "పోలీసుల లాఠీచార్జ్‌కు సిద్ధం" వంటి సరదా శీర్షికలతో వీడియోలు రూపొందించారు. నిరసనకు వెళ్లే ముందు చేసిన ఏర్పాట్లు, పోలీసుల వెంటపడిన దృశ్యాలు, అరెస్టు సమయంలో తీసుకున్న సెల్ఫీలు, పోలీసు వాహనాల్లో పాటలు పాడిన వీడియోలు విపరీతంగా వైరల్ అయ్యాయి. భయాన్ని కూడా వినోదంగా మార్చి మరింత మందిని ఉద్యమంలోకి ఆకర్షించారు.

**భయమే కంటెంట్**

పోలీసుల చర్యల తర్వాత కూడా యువత వెనక్కి తగ్గలేదు. టియర్ గ్యాస్ నుంచి ఎలా రక్షించుకోవాలి, లాఠీ దెబ్బల నుంచి తప్పించుకునేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, గాగుల్స్, థర్మాకోల్ షీట్లు ఎలా ఉపయోగించాలి వంటి సూచనలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సమాచారం ఉద్యమంలో పాల్గొనే వారికి మార్గదర్శకంగా మారింది. ఒక్కో వీడియో వేల మందికి ధైర్యాన్ని ఇచ్చింది.

**ఉద్యమమే ఒక కమ్యూనిటీ**

జంతర్ మంతర్‌లో ఆహారం, టీ, ఐస్‌క్రీమ్, వైద్య సహాయం, న్యాయ సహాయం అందుబాటులో ఉండటం కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం పొందింది. ఉద్యమానికి వచ్చిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తమకు చేతనైన పని చేశారు. నాయకత్వం కంటే లక్ష్యమే ముఖ్యమనే భావన ఈ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. అపరిచితుల మధ్య కూడా ఐక్యత కనిపించింది.

**ఫోటో కాదు... ఆధారం**

"మేమెందుకు ఇన్ని ఫోటోలు తీస్తామో ఇప్పుడు అర్థమవుతుందా? నిజాన్ని నిరూపించడానికి ఆధారాలు కావాలి" అని ఉద్యమంలో పాల్గొన్న రియా అహిర్ వ్యాఖ్యానించింది. ఈ ఉద్యమంలో ప్రతి వీడియో, ప్రతి ఫోటో ఒక సాక్ష్యంగా నిలిచింది. టెలివిజన్ కెమెరాలు చేరని ఎన్నో ఘటనలను యువత తమ మొబైల్ ఫోన్లతో ప్రపంచానికి చూపించింది. దీంతో అధికారిక కథనాలకు భిన్నంగా మరో కథనం ప్రజల ముందుకు వచ్చింది.

**జెన్‌జీ ఇచ్చిన కొత్త పాఠం**

ఈ ఉద్యమం ఒక విషయాన్ని స్పష్టంగా నిరూపించింది. నేటి తరం చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ కేవలం వినోద సాధనం కాదు. అది కెమెరా, డైరీ, ఆధారాల భాండాగారం, ప్రచార వేదిక. ఒకప్పుడు సోషల్ మీడియాలో సమయం వృథా చేస్తున్నారని విమర్శలు ఎదుర్కొన్న జెన్‌జీ... అదే సోషల్ మీడియాను ప్రజాస్వామ్య పోరాటానికి శక్తివంతమైన ఆయుధంగా మార్చింది. వీధుల్లో మొదలైన ఉద్యమం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, పోస్టులు, స్టోరీల రూపంలో దేశవ్యాప్తంగా విస్తరించింది. డిజిటల్ యుగంలో ప్రజా ఉద్యమాల స్వరూపం ఎలా మారిందో ప్రపంచానికి ఈ జెన్‌జీ ఉద్యమం కొత్త నిర్వచనం ఇచ్చింది.

# ప్రజాస్వామ్యానికి కొత్త ఆశ

- **యువ శక్తికి తలవంచిన పాలకులు**

దేశ రాజకీయాల్లో అరుదైన పరిణామానికి జెన్ జీ యువత కారణమైంది. నీట్ వివాదంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనలు చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిశాయి. ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో యువత శక్తి ఎంత గొప్పదో మరోసారి చాటిచెప్పింది. మతం, కులం, ప్రాంతం వంటి కృత్రిమ విభజనలకు అతీతంగా యువత ఒకే లక్ష్యంతో ముందుకు రావడం ఈ ఉద్యమానికి ప్రత్యేకతగా నిలిచింది.

**అధికారం తొలిసారి వెనక్కి తగ్గింది**

ప్రజల ఆగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఒకప్పుడు బాధ్యతను స్వీకరించడం రాజకీయ నైతికతగా ఉండేదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత మంత్రులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసే సంప్రదాయం ఉండేదని చెబుతున్నారు. కాలక్రమంలో ఆ రాజకీయ సంస్కృతి బలహీనపడిందనే విమర్శలు వినిపిస్తున్న వేళ ఈ రాజీనామా మరోసారి బాధ్యతపై చర్చకు దారితీసింది.

**యువత చూపిన ఐక్యత**

ఈ ఉద్యమంలో యువత మతం, భాష, ప్రాంతం అనే భేదాలను పక్కన పెట్టింది. ఒకే లక్ష్యం కోసం దేశ నలుమూలల నుంచి విద్యార్థులు కలిసి పోరాడారు. పెద్దలు చేయలేకపోయిన ఐక్యతను యువత చూపించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రశ్నించే ధైర్యం, అన్యాయాన్ని ఎదిరించే నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలపై నమ్మకం ఈ ఉద్యమాన్ని విజయవంతం చేశాయని పరిశీలకులు భావిస్తున్నారు.

**ప్రజాస్వామ్యానికి కొత్త సందేశం**

ఈ పరిణామం అధికారంలో ఉన్నవారికి కూడా స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. ప్రజల విశ్వాసమే ప్రభుత్వాల అసలు బలం అని మరోసారి గుర్తు చేసింది. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చివరకు ప్రజాస్వామ్యమే సమాధానం చెబుతుందనే సంకేతం వెలువడింది. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించడం, బాధ్యతను స్వీకరించడం ప్రజాస్వామ్యంలో కీలకమైన విలువలని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.



**దేశ భవిష్యత్తుకు జెన్ జీ దిశానిర్దేశం**

జెన్ జీ కేవలం సోషల్ మీడియా తరమే కాదని ఈ ఉద్యమం నిరూపించింది. అవసరం వచ్చినప్పుడు వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడగల తరం ఇదేనని స్పష్టమైంది. దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంత కీలకమో ఈ ఉద్యమం చూపించింది. ప్రజాస్వామ్యంలో మార్పు కోసం వయసు అడ్డంకి కాదని, సంకల్పమే అసలైన శక్తి అని జెన్ జీ మరోసారి నిరూపించింది. ఈ పోరాటం భవిష్యత్తు తరాలకు కూడా ప్రజాస్వామ్య బాధ్యతపై కొత్త స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
ఆదివారం 26 జులై 2026
www.prabhathakiranam.com

## సోషల్ మీడియాలో దూకుడు పెంచండి: యనమల



తేటగుంట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన తుని నియోజకవర్గ ఐటీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో తెలుగు దేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పాల్గొన్నారు. ఐటీడీపీ సభ్యులు మరింత చురుకుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ప్రస్తుతం రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని, అందుకు అనుగుణంగా ఐటీడీపీ సభ్యుల పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై ఐటీడీపీ కార్యకలాపాలను ప్రతి వారం సమీక్షిస్తామని తెలిపారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా సమర్థంగా పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐటీడీపీ పోస్టింగ్ లన్నీ కేంద్ర పార్టీ కార్యాలయానికి అనుసంధానమవుతాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వ విప్ యనమల దివ్య కృషితో నియోజకవర్గానికి వచ్చిన నిధులు, ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అలాగే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాలకు వెంటనే సోషల్ మీడియాలో సమాధానం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో యనమల రాజేష్, తుని మండల టీడీపీ అధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## యనమలను పరామర్శించిన కొవ్వూరు ఎమ్మెల్యే



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తేటగుంట క్యాంప్ కార్యాలయంలో తెలుగు దేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల సోదర వియోగం సంభవించిన నేపథ్యంలో యనమలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు కొద్దిసేపు మాట్లాడుకున్నారు. యనమల కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం యనమల రామకృష్ణుడికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు. సమావేశానికి పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారు.


6లో..

## స్నేహితుడా.. స్నేహితుడా..
# రహస్య స్నేహితుడా!

- కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..
- కలిసిపోతున్న నేతలు.. ప్రయోజనాలే పరమావధి
- డబ్బుల లెక్కలే... రాజకీయాల్లో మారుతున్న ట్రెండ్

ఒకప్పుడు ఒకే వేదికపై కనిపిస్తే రాజకీయ భూకంపమే అనుకునే నాయకులు... ఇప్పుడు ఒకే టేబుల్ దగ్గర కూర్చుంటే ఎవరూ ఆశ్చర్యపడటం లేదు. సభల్లో మాటల తూటాలు పేల్చిన వారు... తెర వెనుక మాత్రం చిరునవ్వులు పంచుకుంటున్నారనే భావన ప్రజల్లో బలపడుతోంది. కార్యకర్తలు మాత్రం ఇప్పటికీ పాత యుద్ధాల గాయాలనే మోస్తున్నారు. నాయకులు చేతులు కలుపుతున్నారు... కానీ కిందిస్థాయి కార్యకర్తలు ఇంకా ఒకరినొకరు శత్రువులుగానే చూస్తున్నారు. ఇదే నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విచిత్ర చిత్రం. జెండాలు వేరు... అడుగులు ఒక్కటేనా? వేదికలపై విమర్శలు... గదులలో వ్యూహాలా? ప్రజల ముందున్న రాజకీయ నాటకానికి, తెర వెనుక జరిగే రాజకీయ ఒప్పందాలకు మధ్య ఉన్న గీత రోజురోజుకీ మసకబారుతోందనే చర్చ వినిపిస్తోంది. అధికారం కోసం సమీకరణాలు మారడం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కానీ సిద్ధాంతాలు, నినాదాలు, కార్యకర్తల త్యాగాలు ఒక్క క్షణంలో పక్కకు వెళ్లిపోతే ప్రశ్నలు మాత్రం తప్పవు. చివరకు గెలిచేది నాయకుల వ్యూహమా? లేక నమ్మకంతో పార్టీని మోసిన కార్యకర్తనా? ఈ సందిగ్ధమే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అతి పెద్ద చర్చగా మారింది. ప్రజలు చూస్తున్నారు... కార్యకర్తలు గమనిస్తున్నారు... చరిత్ర మాత్రం నిశ్శబ్దంగా ప్రతి అడుగును నమోదు చేస్తోంది.

# ప్రజల మధ్యే పరిపాలన

## సచివాలయానికే పరిమితం కాను

• ప్రజల్లోనే ఉంటా.. అభివృద్ధే లక్ష్యం • తేల్చి చెప్పిన సీఎం చంద్రబాబు




కర్నూలు జిల్లా ఆస్పరిలో జరిగిన 'సంజీవని' కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను నేరుగా కలిసి వినతులు స్వీకరించారు. అనంతరం జిల్లా పరిపాలన పనితీరును సమీక్షించి ఉత్తమంగా పనిచేసిన అధికారులను అభినందించారు. మంచి పరిపాలన ద్వారానే ప్రజా సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. తాను సచివాలయానికే పరిమితం కానని, సామాన్యుడిలా ప్రజల్లోనే ఉంటూ సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారాలు చూపిస్తానని చెప్పారు.

**మహిళలకు భారీ ఆర్థిక సాయం**

స్వయం సహాయక సంఘాల మహిళలకు ₹197 కోట్ల చెక్కును సీఎం అందజేశారు. ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి సూపర్ సిక్స్ పథకాలను నిరంతరం అమలు చేస్తున్నామని వెల్లడించారు. పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. (5లో..)


5లో..

## విద్యార్థి నేత నుంచి విద్యా శాఖ మంత్రిగా

### ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ కీలక బాధ్యతలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆ శాఖ అదనపు బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించారు. ఇప్పటికే వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పంపిణీ, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహిస్తున్న ఆయనకు ఇప్పుడు విద్యాశాఖ బాధ్యతలు కూడా అప్పగించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. బీజేపీలో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుల్లో ప్రహ్లాద్ జోషి ఒకరిగా గుర్తింపు పొందారు.

## సర్ స్ట్రైక్స్

### ఏపీ ఓటర్ల జాబితాలో భారీ మార్పులు
### ప్రత్యేక సవరణలో సంచలనాలు నమోదు
### ఎస్ఐఆర్‌లో భారీ గుర్తింపులు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో ఓటర్ల జాబితాకు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు 15.2 లక్షల మంది మరణించిన ఓటర్లను గుర్తించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. అలాగే శాశ్వతంగా ఇతర నియోజకవర్గాలకు మారిన 14.4 లక్షల మంది ఓటర్లను గుర్తించినట్లు తెలిపారు. మరో 7.3 లక్షల మంది రెండు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదైనట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.

**44.8 లక్షల ఫారాలు పెండింగ్**

మే 25, 2026 నాటికి రాష్ట్రంలో 4.16 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని అధికారులు తెలిపారు. వీరిలో 3.7 కోట్ల మందికి సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే ద్వారా సేకరించినట్లు వెల్లడించారు. అయితే ఇంకా 44.8 లక్షల మంది ఓటర్ల నుంచి ఫారాలు అందలేదని చెప్పారు. ఈ జాబితాలను జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, బూత్ లెవల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. (5లో..)





## ఎర్రచందనం
# స్మగ్లర్లకు వార్నింగ్

### సహకరిస్తే కఠిన చర్యలు తప్పవ్



ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ సంపదను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ఆపరేషన్ అరణ్య' పురోగతిని తాను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని వెల్లడించారు. (5లో..)



# ఇన్‌స్టాగ్రామ్ విప్లవం

వివరాలు3లో..

- రీల్స్‌తో రాసిన చరిత్ర
- జెన్‌జీ ఉద్యమానికి కొత్త ఊపు!

జంతర్ మంతర్‌లో సాగిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం కేవలం రోడ్లపై జరిగిన నిరసనగా మాత్రమే నిలవలేదు. సోషల్ మీడియా వేదికగా కోట్లాది మందిని చేరుకున్న డిజిటల్ ఉద్యమంగా మారింది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ఈ పోరాటానికి ప్రధాన ఆయుధంగా నిలిచింది. జెన్‌జీ యువత తమ ఫోన్లను కెమెరాలుగా, ఆధారాలుగా, ప్రచార సాధనాలుగా మార్చి ఉద్యమాన్ని దేశమంతా విస్తరించింది. దీంతో జంతర్ మంతర్‌లో ఉన్నవారితో పాటు అక్కడికి రాని లక్షల మంది కూడా ఈ ఉద్యమంలో భాగమయ్యారు.

**రీల్స్‌తో ఉద్యమానికి ఊపు**

జెన్‌జీ యువత నిరసనను సంప్రదాయ పద్ధతిలో కాకుండా కొత్త శైలిలో ప్రపంచానికి చూపించింది. "జంతర్ మంతర్‌కు వెళ్తున్నాను", "పోలీసుల లాఠీచార్జ్‌కు సిద్ధం" వంటి సరదా శీర్షికలతో వీడియోలు రూపొందించారు. నిరసనకు వెళ్లే ముందు చేసిన ఏర్పాట్లు, పోలీసుల వెంటపడిన దృశ్యాలు, అరెస్టు సమయంలో తీసుకున్న సెల్ఫీలు, పోలీసు వాహనాల్లో పాటలు పాడిన వీడియోలు విపరీతంగా వైరల్ అయ్యాయి. భయాన్ని కూడా వినోదంగా మార్చి మరింత మందిని ఉద్యమంలోకి ఆకర్షించారు.

# నీట్ తరహా డీఎస్సీ పోరాటం..!

### » జగన్ కొత్త ఉద్యమ వ్యూహం
### » డీఎస్సీతో వైసీపీ దూకుడు



రాజకీయాల్లో గెలుపు ఎంత సహజమో, ఓటమి కూడా అంతే సహజం. కానీ ఓటమి తర్వాత నాయకుడు ఎలాంటి మార్గాన్ని ఎంచుకుంటాడన్నదే అతని రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. 2024 ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 2029 ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ఉద్యమ రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రజల్లో మళ్లీ పట్టు సాధించడం, పార్టీ కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెంచడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం ద్వారా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలవాలన్న వ్యూహంతో పార్టీ ముందుకు సాగుతోంది.

**కేడర్‌లో పోరాట స్ఫూర్తి**

ఎన్నికల ఓటమి తర్వాత కార్యకర్తల్లో నిరుత్సాహం సహజం. అలాంటి సమయంలో వారిలో ధైర్యం నింపడం నాయకత్వానికి పెద్ద పరీక్ష. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన "బొద్దింకల పట్టుదల" వ్యాఖ్య రాజకీయంగా విస్తృత చర్చకు దారితీసింది. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా పోరాడాలనే సందేశాన్ని పార్టీ శ్రేణులకు ఇవ్వాలన్న ఉద్దేశమే ఆ వ్యాఖ్య వెనుక ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రత్యర్థులు విమర్శించినా, వైసీపీ కార్యకర్తలు మాత్రం దాన్ని పోరాట నినాదంగా స్వీకరించినట్లు కనిపిస్తోంది.

## రాజీనామా ఎప్పుడు?

• ధర్మేంద్ర గతే లోకేశ్‌కు • జగన్ వార్నింగ్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ పరీక్షల నిర్వహణపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడాన్ని ప్రస్తావించిన జగన్, అదే ప్రమాణాలు ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు కావాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.
(వివరాలు 5లో..)



# 'భయపడకపోతే గెలుస్తాం'..

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజీత్ దిప్కే
### ఇది తొలి విజయం.. పోరాటం ఇంకా ఉంది
### రాజీనామాతో జంతర్ మంతర్‌లో సంబరాలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ ఉద్యమ వేదిక సంబరాలతో మార్మోగింది. నిరసనకారులు నినాదాలు చేస్తూ విజయోత్సాహం వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే వేదికపైకి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ఊపారు. ఏ.ఆర్. రెహమాన్ ఆలపించిన వందే మాతరం పాటను పాడుతూ ఉద్యమకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. (3లో..)

## జెన్ జీ ప్రభావం

- 12 ఏళ్ల బీజేపీ వ్యూహానికి జెన్ జీ సవాల్
- మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సంకేతం

నీట్ ప్రశ్నాపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన ఉద్యమం, వేలాది మంది యువత ఒత్తిడి తర్వాత ఈ నిర్ణయం రావడం విశేషం. ఇది కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిన తొలి సందర్భం కాదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే యువత ఆధ్వర్యంలో సాగిన ఉద్యమానికి లభించిన ఈ ఫలితం కొత్త రాజకీయ సంకేతాలను ఇస్తోందని భావిస్తున్నారు.

## ప్రజాస్వామ్యానికి కొత్త ఆశ

### యువ శక్తికి తలవంచిన పాలకులు

దేశ రాజకీయాల్లో అరుదైన పరిణామానికి జెన్ జీ యువత కారణమైంది. నీట్ వివాదంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనలు చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిశాయి. ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో యువత శక్తి ఎంత గొప్పదో మరోసారి చాటిచెప్పింది. మతం, కులం, ప్రాంతం వంటి కృత్రిమ విభజనలకు అతీతంగా యువత ఒకే లక్ష్యంతో ముందుకు రావడం ఈ ఉద్యమానికి ప్రత్యేకతగా నిలిచింది. (వివరాలు 3లో..)



## డీఎస్సీపై ఆధారాలు చూపండి

### విచారణకు సిద్ధమన్న మండిపల్లి

ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా ప్రభుత్వం చట్టబద్ధమైన విచారణకు పూర్తిగా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. (5లో..)

# నీట్ తరహా డీఎస్సీ పోరాటం



(మొదటి పేజీ తరువాయి..)

### ప్రజా సమస్యలే ప్రధాన అజెండా

ప్రతిపక్ష రాజకీయాల్లో ఉద్యమాలే ప్రధాన ఆయుధం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని వైసీపీ ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాలను ముందుకు తీసుకొస్తోంది. రైతుల సమస్యలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు, విద్యార్థుల ఇబ్బందులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. ప్రజా సమస్యలతోనే రాజకీయ బలం పెంచుకోవాలన్న వ్యూహం అమలవుతున్నట్లు కనిపిస్తోంది.

### డీఎస్సీపై పోరాటానికి సిద్ధం

ఈ క్రమంలో డీఎస్సీ అంశాన్ని వైసీపీ అత్యంత కీలక రాజకీయ అజెండాగా మార్చింది. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న సుమారు 3.5 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా దీన్ని ప్రస్తావిస్తోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తూ పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తోంది. అవసరమైతే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కూడా కోరుతోంది. ఇదే సమయంలో ప్రభుత్వం మాత్రం డీఎస్సీ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేస్తూ ఆరోపణలను తిరస్కరిస్తోంది.

### నీట్ తరహా రాజకీయ వ్యూహం

దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిన నీట్ వివాదాన్ని రాజకీయంగా ఉదాహరణగా చూపిస్తూ వైసీపీ డీఎస్సీ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయత, పారదర్శకత వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని ఉద్యమాలను విస్తరించాలని పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నీట్ వ్యవహారం, డీఎస్సీ అంశం ఒకటేనని అధికారికంగా ఎక్కడా నిర్ధారణ కాలేదు. ఈ పోలిక ప్రస్తుతం రాజకీయ విమర్శల్లో భాగంగానే వినిపిస్తోంది.

### జంతర్ మంతర్ తరహా ఉద్యమం

డీఎస్సీ అంశాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమంగా మార్చేందుకు వైసీపీ కార్యాచరణ రూపొందించింది. ఈ నెల 28న అన్ని జిల్లా కేంద్రాల్లో యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. డీఎస్సీపై సీబీఐ విచారణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి అమలు వంటి డిమాండ్లతో ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా జరిగిన విద్యార్థి ఉద్యమాల తరహాలో ప్రజా ఒత్తిడి సృష్టించడమే లక్ష్యంగా ఈ వ్యూహం రూపొందించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### ఢిల్లీ సమీకరణాలపై ఆసక్తి

ఇదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీకి అపాయింట్‌మెంట్ కోరినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశం జరిగితే రాష్ట్ర రాజకీయాలు, కేంద్రరాష్ట్ర సంబంధాలు, ఇతర కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉందనే ప్రచారం ఉంది. అయితే అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

### 2029 లక్ష్యంగా రాజకీయ పోటీ

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయి. అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాన అస్త్రంగా ముందుకు తీసుకెళ్తుంటే, ప్రతిపక్షం ఉద్యమాలను ప్రధాన రాజకీయ ఆయుధంగా మలుచుకుంటోంది. డీఎస్సీ అంశం యువతలో ఎంత ప్రభావం చూపుతుంది, ప్రభుత్వం తన వివరణతో ప్రజలను ఎంతవరకు ఒప్పించగలుగుతుంది, వైసీపీ చేపట్టిన ఉద్యమాలు రాజకీయంగా ఎంత బలం ఇస్తాయి అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. చివరికి ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ప్రజలదే. అదే 2029 ఎన్నికల దిశను నిర్ణయించే అసలు ప్రమాణంగా నిలవనుంది.

## డీఎస్సీపై ఆధారాలు చూపండి

(మొదటి పేజీ తరువాయి..)

### లోకేశ్‌పై ఆరోపణలు నిరాధారం

మంత్రి నారా లోకేశ్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమని మండిపల్లి అన్నారు. ఆరోపణలు చేయడం తప్ప వాటిని నిరూపించే ఆధారాలు చూపించే అలవాటు వైసీపీకి లేదని విమర్శించారు. నిజాలు లేకుండా రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలో జగన్ నివాసానికి సమీపంలోనే లోకేశ్ డీఎస్సీ అంశంపై బహిరంగ సవాల్ విసిరారని మంత్రి గుర్తు చేశారు. ఆ సవాల్‌కు జగన్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఆరోపణలు నిజమైతే వాటిని ఆధారాలతో ప్రజల ముందుకు తీసుకురావాలని, కేవలం రాజకీయ విమర్శలతో సరిపెట్టడం సరైన విధానం కాదన్నారు.

### యువతను తప్పుదోవ పట్టించొద్దు

ప్రభుత్వం ఇప్పటికే డీఎస్సీ నియామకాలపై అధికారిక వివరాలు వెల్లడించినప్పటికీ వైసీపీ వాటిని పట్టించుకోకుండా విమర్శలు కొనసాగిస్తోందని మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు వెంటనే ఆపాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే ప్రతిపక్ష లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. డీఎస్సీ నియామకాల అంశానికి రాజకీయ రంగు పులమడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చ జరపాల్సిన సమయంలో తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టపరమైన విచారణకు సిద్ధంగా ఉన్నామని మరోసారి స్పష్టం చేశారు.

## రాజీనామా ఎప్పుడు?

(మొదటి పేజీ తరువాయి..)



### ధర్మేంద్ర రాజీనామాను ప్రస్తావించిన జగన్

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత స్వీకరిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని జగన్ గుర్తు చేశారు. ఈ నిర్ణయం ఎన్డీఏ ప్రభుత్వంలో రాజకీయ బాధ్యతకు ఒక ప్రమాణంగా నిలిచిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న నాయకులు తప్పిదాలు జరిగినప్పుడు బాధ్యత తీసుకోవడం ప్రజాస్వామ్యానికి అవసరమని తన ట్వీట్‌లో సూచించారు.

### డీఎస్సీపై లోకేశ్‌కు సవాల్

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3.5 లక్షల మంది అభ్యర్థులు రాసిన డీఎస్సీ పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. కేంద్రంలో అమలు చేసిన ప్రమాణాలనే రాష్ట్రంలో కూడా పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

### చంద్రబాబుపై కూడా ప్రశ్నలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ వ్యవహారంలో ఎలా స్పందిస్తారన్న ప్రశ్నను కూడా జగన్ లేవనెత్తారు. నైతిక బాధ్యతకు ప్రాధాన్యం ఇస్తారా, లేక తన కుమారుడి పదవిని కాపాడేందుకు ప్రయత్నిస్తారా అని నిలదీశారు. ఎన్డీఏ ప్రభుత్వం చెప్పుకునే విలువలు, జవాబుదారీతనం ఇప్పుడు ఆచరణలో కనిపించాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి డీఎస్సీ అంశాన్ని కేంద్రబిందువుగా మార్చాయి. ఒకవైపు ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణ పారదర్శకంగా జరిగిందని చెబుతుండగా, మరోవైపు ప్రతిపక్షం అక్రమాల ఆరోపణలను మరింత బలంగా వినిపిస్తోంది.

# ప్రజల మధ్యే పరిపాలన

(మొదటి పేజీ తరువాయి..)



### రాయలసీమకు భారీ పెట్టుబడులు

రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రాయలసీమ ఇరిగేషన్ కోసం కేవలం ₹2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని విమర్శించారు. తమ కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఇరిగేషన్ రంగానికి ₹12 వేల కోట్లు కేటాయించిందన్నారు. గతంలో ఒక్క పెట్టుబడీ రాలేదని, ఇప్పుడు రాయలసీమను "రత్నాల సీమ"గా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సీఎం సూచించారు. జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచుతున్నామని తెలిపారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ₹1,768 కోట్లతో పూర్తి చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయడానికి ప్రత్యేక ఇరిగేషన్ క్యాలెండర్ సిద్ధం చేశామని చెప్పారు. 2027 మార్చి నాటికి పోలవరం, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని గడువు వెల్లడించారు.

### ఆరోగ్యానికి కొత్త దారి

సంజీవని కార్యక్రమం కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన సీఎం, ప్రజల ఆరోగ్యం వారి జీవన శైలిపైనే ఆధారపడుతుందని చెప్పారు. వంటగదినే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా మార్చుకుంటే అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత ఏఐ డాక్టర్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రతి వ్యక్తి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని తెలిపారు. భూ హక్కుల రక్షణ కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని వెల్లడించారు.

### వైసీపీపై విమర్శలు.. హెచ్చరికలు

గత ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త ఎకరాకు కూడా సాగునీరు అందలేదని, ఒక్క పెద్ద ప్రాజెక్టు కూడా పూర్తికాలేదని చంద్రబాబు విమర్శించారు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీని రద్దు చేసిన వారే ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళల భద్రత విషయంలో రాజీ ఉండదని, "మా ఆడబిడ్డల జోలికి ఎవరైనా వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది" అంటూ తీవ్ర హెచ్చరిక చేశారు. అలాగే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.

# ఎర్రచందనం స్మగ్లర్లకు వార్నింగ్

(మొదటి పేజీ తరువాయి..)

### రూ.1.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

కడప జిల్లా అవధూత కాశినాయన మండలం వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద జరిగిన భారీ పట్టివేతపై పవన్ కళ్యాణ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన బొలెరో మ్యాక్స్ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

### బీట్ ఆఫీసర్ పాత్రపై దర్యాప్తు

విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగి అక్రమాలకు పాల్పడటం అత్యంత తీవ్రమైన అంశమని భావిస్తున్నామని, అతడి పాత్రపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి నివేదిక సమర్పించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ కేసు విచారణలో బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాలకు చెందిన మరికొందరు కీలక సూత్రధారుల పాత్ర వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వివరించారు. వారిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### 'ఆపరేషన్ అరణ్య' మరింత ముమ్మరం

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత దూకుడుగా ముందుకు సాగుతుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులు, మధ్యవర్తులు, స్మగ్లర్లు ఎవరైనా చట్టం ముందు తప్పించుకోలేరని హెచ్చరించారు. అటవీ సంపదను కాపాడటంలో కఠిన చర్యలు కొనసాగుతాయని, 'ఆపరేషన్ అరణ్య' ద్వారా స్మగ్లింగ్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## సర్ స్ట్రైక్స్

(మొదటి పేజీ తరువాయి..)

### గుర్తుతెలియని ఓటర్లు కూడా

మొత్తం ఓటర్లలో 7.7 లక్షల మంది అంటే సుమారు 1.8 శాతం మంది ఇంటింటి సర్వేలో గుర్తుతెలియలేదని అధికారులు తెలిపారు. మరోవైపు 44.8 లక్షల పెండింగ్ ఫారాల్లో 37 లక్షలకుపైగా మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, రెండు చోట్ల నమోదు అయిన వారేనని స్పష్టం చేశారు.

### జూలై 31 నుంచి అభ్యంతరాలు

ఓటర్ల ముసాయిదా జాబితాపై పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించి ప్రజలు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు సమర్పించవచ్చని ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఇప్పటికే 4.16 కోట్ల ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. 8,327 ఫారాలను మాత్రం ఓటర్లు తిరస్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడమే ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఎన్నికల శాఖ స్పష్టం చేసింది.

## విద్యార్థి నేత నుంచి విద్యా శాఖ మంత్రిగా

(మొదటి పేజీ తరువాయి..)

ప్రహ్లాద్ జోషి తన రాజకీయ ప్రస్థానాన్ని కర్ణాటకలో విద్యార్థి ఉద్యమాల ద్వారా ప్రారంభించారు. సంస్థాగత స్థాయిలో పనిచేస్తూ పార్టీకి బలమైన నాయకుడిగా ఎదిగారు. తర్వాత భారతీయ జనతా పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించారు. కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2004 నుంచి వరుసగా 5 సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. కర్ణాటక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలను సమర్థంగా నిర్వహించారు.

### ఆర్ఎస్ఎస్‌తో సుదీర్ఘ అనుబంధం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో ప్రహ్లాద్ జోషికి సుదీర్ఘ అనుబంధం ఉంది. పార్టీ సంస్థాగత వ్యవహారాలు, పార్లమెంటరీ వ్యూహాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. అందుకే బీజేపీ అధిష్ఠానం నమ్మకమైన నాయకుల్లో ఆయన పేరు ముందువరుసలో ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ప్రహ్లాద్ జోషి ఇటీవల స్పష్టం చేశారు. పరీక్షల్లో జరిగే అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, యువతకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యాశాఖ అదనపు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనపై మరింత బాధ్యత పెరిగిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# 'భయపడకపోతే గెలుస్తాం'

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజీత్ దిప్కే
- ఇది తొలి విజయం.. పోరాటం ఇంకా ఉంది
- రాజీనామాతో జంతర్ మంతర్‌లో సంబరాలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన వెంటనే ఢిల్లీలోని జంతర్ మంతర్ ఉద్యమ వేదిక సంబరాలతో మార్మోగింది. నిరసనకారులు నినాదాలు చేస్తూ విజయోత్సాహం వ్యక్తం చేశారు. కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే వేదికపైకి చేరుకుని త్రివర్ణ పతాకాన్ని ఊపారు. ఏ.ఆర్. రెహమాన్ ఆలపించిన వందే మాతరం పాటను పాడుతూ ఉద్యమకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

### భయపడకపోతే విజయం సాధ్యమే

ఉద్యమకారులను ఉద్దేశించి మాట్లాడిన అభిజీత్ దిప్కే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజా ఉద్యమ విజయానికి నిదర్శనమని అన్నారు. ప్రజాస్వామ్యంలో భయపడకుండా గొంతెత్తితే గెలవొచ్చని ఈ పరిణామం నిరూపించిందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజల వల్లే ఆ స్థానంలో ఉంటారని, అందుకే ప్రజలు ప్రశ్నిస్తేనే వారు బాధ్యతగా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించారు.

### ఇది తొలి వికెట్ మాత్రమే

"ఇది తొలి వికెట్ మాత్రమే. ఇక్కడితో మా పోరాటం ఆగదు. ఇది ప్రారంభం మాత్రమే" అని దిప్కే స్పష్టం చేశారు. గత 36 రోజులుగా జంతర్ మంతర్ వద్ద కూర్చొని ఉద్యమాన్ని కొనసాగించిన విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలకు ఆయన సెల్యూట్ చేశారు. ఈ విజయానికి కారణం వేలాది మంది యువత ఐక్యంగా పోరాడటమేనని చెప్పారు.

### ఇంకా రెండు డిమాండ్లు మిగిలే ఉన్నాయి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం ముగిసిపోలేదని దిప్కే ప్రకటించారు. ఇంకా రెండు ప్రధాన డిమాండ్లు నెరవేరాల్సి ఉందని చెప్పారు. నీట్ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

### విద్యార్థులపై చర్యలు వద్దు

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై జరిగిన చర్యలను దిప్కే తీవ్రంగా ఖండించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని డిమాండ్ చేశారు. విద్యార్థులపై బలప్రయోగం చేసిన భద్రతా సిబ్బంది, ఢిల్లీ పోలీస్ అధికారుల నుంచి బహిరంగ క్షమాపణ రావాలని కోరారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని ఎక్స్‌లో "థ్యాంక్యూ" అంటూ చేసిన పోస్టు ఉద్యమకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది.

### ఉద్యమం కొనసాగుతుందన్న స్పష్టమైన సంకేతం

జూన్ 20న ప్రారంభమైన కాక్‌రోచ్ జనతా పార్టీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఉద్యమం సాధించిన తొలి విజయంగా అభిజీత్ దిప్కే అభివర్ణించారు. మిగిలిన డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత ఉద్యమాలకు ఫలితం ఉంటుందని, యువత ఐక్యతే ఈ విజయానికి ప్రధాన కారణమని మరోసారి వెల్లడించారు.

# జెన్ జీ ప్రభావం

- 12 ఏళ్ల బీజేపీ వ్యూహానికి జెన్ జీ సవాల్
- మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సంకేతం



నీట్ ప్రశ్నాపత్రం లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన ఉద్యమం, వేలాది మంది యువత ఒత్తిడి తర్వాత ఈ నిర్ణయం రావడం విశేషం. ఇది కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిన తొలి సందర్భం కాదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే యువత ఆధ్వర్యంలో సాగిన ఉద్యమానికి లభించిన ఈ ఫలితం కొత్త రాజకీయ సంకేతాలను ఇస్తోందని భావిస్తున్నారు.

### వెనక్కి తగ్గిన కేంద్రం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో గతంలో కూడా పలు కీలక నిర్ణయాలు వెనక్కి తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. 2015లో భూసేకరణ చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. 2018లో మీటూ ఆరోపణల తర్వాత విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎం.జే. అక్బర్ రాజీనామా చేశారు. 2021లో ఏడాదికిపైగా రైతుల ఆందోళనల తర్వాత మూడు వ్యవసాయ చట్టాలను కేంద్రం రద్దు చేసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కూడా అదే తరహా పరిణామాల్లో ఒకటిగా చర్చకు వస్తోంది.

### ఉద్యమం ముగియలేదు

కేంద్ర ప్రభుత్వం అన్ని ఉద్యమాల్లో వెనక్కి తగ్గలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. 2016లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఉద్యమం, 201920 పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సమయంలో కేంద్రం తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. ఆ ఉద్యమాల సమయంలో ఏర్పడిన రాజకీయ ధ్రువీకరణ బీజేపీకి అనుకూలంగా మారిందనే విశ్లేషణలు ఉన్నాయి.

### జెన్ జీ రాజకీయాల్లో కొత్త శక్తి

ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జెన్ జీ యువత మతం, కులం, ప్రాంతం వంటి విభజనలకు దూరంగా విద్య, ఉపాధి, భవిష్యత్తు వంటి అంశాలపై ఉద్యమం చేపట్టడం ప్రత్యేకతగా మారింది. కొత్త తరం నాయకత్వం, కొత్త తరహా రాజకీయ చైతన్యం దేశ రాజకీయాలపై ప్రభావం చూపుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.

### బీజేపీ వ్యూహాలకు కొత్త పరీక్ష

గత 12 ఏళ్లుగా అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలు భవిష్యత్తులో సరిపోతాయా అనే ప్రశ్న ఇప్పుడు ముందుకొస్తోంది. యువత ఆశలు, ఆందోళనలు, సమస్యలను అర్థం చేసుకుని కొత్త రాజకీయ విధానాలతో ముందుకు రావాల్సిన అవసరం ఏర్పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జెన్ జీ ఓటర్లు, యువ నాయకులు దేశ రాజకీయాల్లో కీలక శక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో వారితో సంభాషించే కొత్త మార్గాలను రాజకీయ పార్టీలు అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పరిశీలకులు భావిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక్క మంత్రి మార్పుగా కాకుండా దేశ రాజకీయాల్లో కొత్త తరం ప్రభావానికి సంకేతంగా నిలిచే అవకాశం ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

## కాక్రోచ్ ఎగబాకింది

కాక్రోచ్ అని నవ్విన నోళ్లే...
నేడు నిశ్శబ్దం అయ్యాయి!
బూటుకాలి కింద నలిగిన
బొద్దింక... పిడికిలిగా మారింది.

లాఠీ దెబ్బలతో చర్మం చీలినా...
సంకల్పం మాత్రం చెదరలేదు.
నెత్తుటి చుక్కలు... స్వేచ్ఛకు
కొత్త సంతకాలు అయ్యాయి.

నీట్ అని పేరుపెట్టి... భవిష్యత్తును బందీ
చేసిన గోడలు కంపించాయి.
బొద్దింకలని అవహేళన చేసిన చరిత్ర...
సిగ్గుతో తలవంచింది.

పుస్తకాలు మోసిన చేతులు...
జెండాలు మోశాయి.
కన్నీటి కళ్లలో... విప్లవం
అగ్గిరవ్వలా వెలిగింది.

ప్రతి గాయం... ఒక కొత్త
నినాదంగా మారింది.
ప్రతి లాఠీ దెబ్బ... మరో అడుగు
ముందుకు నడిపింది.

జంతర్ మంతర్ నేల... మరో
జలియన్‌వాలా బాగ్‌ను గుర్తు చేసింది.
రక్తం తడిసిన రహదారిపై... తిరంగా
మరింత ఎత్తున ఎగిరింది.

యువతను కాక్రోచ్ అన్న రాజ్య గర్వం...
తన నీడకే భయపడింది.



ఎందుకంటే... తొక్కబడిన ప్రాణం
తిరగబడితే చరిత్ర పుడుతుంది.

నలిగిన బొద్దింక... రెక్కలు మొలిచిన
గరుత్మంతుడైంది.
నిశ్శబ్దాన్ని చీల్చిన యువ గర్జన...
దేశం మనసును తాకింది.

స్వాతంత్ర్యం పాత కథ కాదు...
ప్రతి తరంలో మళ్లీ పుట్టే జ్వాల అని
నిరూపించింది.

విజయం ఒక బహుమతి కాదు...
రక్తంతో రాసుకున్న హక్కని చాటింది.

"గెలుపు మాదే" అని ఎగిసిన జెన్ జీ...
భవిష్యత్తుకు కొత్త నిర్వచనం ఇచ్చింది.
కాక్రోచ్ అని తక్కువ చేసిన జనరేషన్...
భారత గుండెల్లో విజయ పతాకమై
ఎగబాకింది.

— నా దేశం



స్నేహితుడా.. స్నేహితుడా..

# రహస్య స్నేహితుడా !

## కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..



రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు. శాశ్వత మిత్రులు కూడా ఉండరు. కాలం, పరిస్థితులు, అధికారం, ఎన్నికల లెక్కలు సమీకరణాలను మార్చేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను గమనిస్తున్న వారికి ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం కూడా అలాంటిదే. ఒకప్పుడు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసిన నాయకులు, ఇప్పుడు స్థానిక స్థాయిలో కలిసి కనిపిస్తున్నారనే చర్చ అనేక ప్రాంతాల్లో వినిపిస్తోంది. ఇది నిజంగా రాజకీయ అవసరమా? స్థానిక పరిస్థితుల ప్రభావమా? లేక అధికారానికి దగ్గరగా ఉండాలనే ప్రయత్నమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ చర్చలన్నింటి మధ్య ఎక్కువగా వినిపిస్తున్న స్వరం మాత్రం కార్యకర్తలదే. "మేము పోరాడింది ఎవరి కోసం?" అనే ప్రశ్న క్షేత్రస్థాయిలో పలుచోట్ల వినిపిస్తోంది.

### • సిద్ధాంతాల నుంచి సమీకరణాల వరకు

ఒకప్పుడు పార్టీ అంటే సిద్ధాంతం. జెండా అంటే గౌరవం. నాయకుడు అంటే ఆదర్శం. కార్యకర్త అంటే నమ్మకం. రాజకీయ పార్టీ కోసం కుటుంబాన్ని కూడా పక్కన పెట్టి పోరాడిన తరాలు ఉన్నాయి. ఎన్నికల్లో ఓడినా పార్టీని విడిచిపెట్టని నాయకులు ఉన్నారు. కాలక్రమేణా రాజకీయ సంస్కృతి మారింది. ఇప్పుడు గెలుపే ప్రధాన లక్ష్యంగా సమీకరణాలు మారుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. అధికారానికి దగ్గరగా ఉండడం, అభివృద్ధి పేరుతో సంబంధాలు పెంచుకోవడం, స్థానిక అవసరాల కోసం ప్రత్యర్థులతో సఖ్యత చూపడం వంటి ధోరణులు పెరిగాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇలాంటి పరిణామాలు కొత్తవి కావు. కాంగ్రెస్ హయాంలో కూడా స్థానిక స్థాయిలో ప్రత్యర్థి వర్గాలతో అవగాహనలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. వ్యక్తిగత సంబంధాలు, సామాజిక సమీకరణాలు, అధికార అవసరాలు అప్పుడప్పుడు రాజకీయ గీతలను చెరిపేశాయి. అయితే అవి పరిమిత స్థాయిలో మాత్రమే కనిపించేవి. మొత్తం రాజకీయ వ్యవస్థనే ప్రభావితం చేసే స్థాయికి చేరలేదు. అందుకే ఇప్పుడు జరుగుతున్న పరిణామాలపై చర్చ మరింత ఎక్కువగా సాగుతోంది.

### • 2024 తర్వాత రాజకీయం

2024 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో అధికార మార్పు జరిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అధికార కూటమిలో భాగమైన పార్టీలు స్థానికంగా తమ బలాన్ని పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఈ సమయంలో గతంలో ప్రత్యర్థి పార్టీల్లో పనిచేసిన కొందరు నాయకులు అధికార పార్టీలకు దగ్గరవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల వారు నేరుగా పార్టీలో చేరగా, మరికొన్ని ప్రాంతాల్లో అనధికారికంగా కలిసి పనిచేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ వాదనలపై అధికారిక స్పష్టత లేకపోయినా, రాజకీయ చర్చ మాత్రం కొనసాగుతోంది. రాయలసీమ జిల్లాల్లో ఈ అంశంపై ఎక్కువ చర్చ జరుగుతోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో తీవ్ర ప్రత్యర్థులుగా ఉన్న నాయకులు ఇప్పుడు స్థానిక అభివృద్ధి, పరిపాలనా అవసరాలు, వ్యక్తిగత సంబంధాల పేరుతో కలిసి పనిచేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. మరికొందరు మాత్రం ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజకీయ భేదాలు పక్కన పెట్టడం తప్పు కాదని అభిప్రాయపడుతున్నారు. ఏది నిజమన్నది ప్రాంతాన్ని బట్టి మారవచ్చు. అయినా కార్యకర్తల్లో అనుమానాలు పెరగడం మాత్రం వాస్తవమేనని పరిశీలకులు చెబుతున్నారు.

### • కార్యకర్తల మనసులో ప్రశ్నలు

ఐదేళ్లు ప్రతిపక్షంలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు ఇప్పుడు తమకు తగిన గుర్తింపు దక్కడం లేదనే భావన వ్యక్తం చేస్తున్నారని పలుచోట్ల వినిపిస్తోంది. కేసులు ఎదుర్కొన్న వారు, ఆర్థికంగా నష్టపోయిన వారు, రాజకీయంగా ఒత్తిళ్లు భరించిన వారు ఇప్పుడు పదవుల పంపకం సమయంలో వెనుకబడుతున్నామనే వాదన వినిపిస్తోంది. "పోరాటం మాది... ఫలితం మరొకరిది" అనే భావన పార్టీ శ్రేణుల్లో చోటు చేసుకుంటే అది భవిష్యత్తులో ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లో వ్యంగ్య వ్యాఖ్యలు కొత్తవి కావు. "జెండా మాత్రమే మారింది... ముఖాలు మారలేదు" అనే వ్యాఖ్యలు కొన్నిచోట్ల వినిపిస్తున్నాయి. "పగలు ఒక పార్టీ... రాత్రి మరో పార్టీ" అనే చమత్కారాలు కూడా సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఇవి నిజ పరిస్థితులను పూర్తిగా ప్రతిబింబిస్తాయా లేదా అన్నది పక్కన పెడితే, కార్యకర్తల్లో అలాంటి భావన కలగడం మాత్రం నాయకత్వం దృష్టి పెట్టాల్సిన అంశమే. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, కమిటీలు, అభివృద్ధి కార్యక్రమాల్లో అవకాశాల పంపకంపై కూడా చర్చ సాగుతోంది. గతంలో ప్రత్యర్థి పార్టీలో ఉన్నవారికి ఎక్కువ ప్రాధాన్యం దక్కుతోందనే ఆరోపణలు కొన్నిచోట్ల వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు అన్ని ప్రాంతాలకు వర్తిస్తాయని చెప్పలేం. అయినా ఒకే తరహా అసంతృప్తి పలు జిల్లాల నుంచి వినిపిస్తే, దానిని పరిశీలించాల్సిన అవసరం ఉంటుందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు.

### • నాయకత్వం ముందున్న సవాలు

పార్టీని విస్తరించాలంటే కొత్త నాయకులు అవసరం. అదే సమయంలో పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను కూడా విస్మరించలేరు. ఈ రెండు వర్గాల మధ్య సమతుల్యత సాధించడం నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతోంది. కొత్తవారిని చేర్చుకోవడం రాజకీయ వ్యూహంలో భాగమే. అయితే పాత కార్యకర్తల్లో నిరాశ పెరగకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతి పార్టీకి కీలకం. గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్ ఎన్నికలు భవిష్యత్తు రాజకీయాలకు పునాది వేస్తాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, కార్యకర్తల భాగస్వామ్యం కీలకంగా మారనున్నాయి. ఇక్కడ తీసుకునే నిర్ణయాలే రాబోయే శాసనసభ ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పెద్ద సభలు, భారీ ర్యాలీలు, స్టార్ ప్రచారకులు ఎన్నికల్లో ఆకర్షణ కలిగిస్తారు. కానీ ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు అడిగేది గ్రామస్థాయి కార్యకర్తే. పోలింగ్ రోజు ఓటరును బూత్‌కు తీసుకెళ్లేది కూడా అతడే. అలాంటి కార్యకర్తలో నిరుత్సాహం పెరిగితే, పెద్ద ఎత్తున ప్రచారం జరిగినా ఆశించిన ఫలితం రాకపోవచ్చని రాజకీయ అనుభవం చెబుతోంది.

### • చరిత్ర చెప్పే పాఠం.. 2029పై ప్రభావం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నో పార్టీలు అధికారంలోకి వచ్చాయి. మళ్లీ అధికారాన్ని కోల్పోయాయి. ప్రతి ఎన్నిక ఒక కొత్త పాఠం నేర్పింది. గత విజయాన్ని శాశ్వతంగా భావించిన పార్టీలు తర్వాతి ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తిన్న సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో కార్యకర్తలను బలోపేతం చేసిన పార్టీలు తిరిగి ప్రజల విశ్వాసం గెలుచుకున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. 2029 ఎన్నికలు ఇంకా దూరంలో ఉన్నా, వాటి పునాది మాత్రం ఇప్పుడు వేయబడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామస్థాయి నాయకత్వం, కార్యకర్తల విశ్వాసం, నిర్ణయాల్లో పారదర్శకత, అవకాశాల పంపకం వంటి అంశాలే రాబోయే ఎన్నికల దిశను నిర్ణయించే అవకాశం ఉంది. ప్రతి రాజకీయ పార్టీ ఈ అంశాలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరగా... రాజకీయ పార్టీలు కేవలం ఎన్నికల యంత్రాలు కావు. అవి వేలాది మంది కార్యకర్తల శ్రమ, త్యాగం, నమ్మకం మీద నిలిచే సంస్థలు. నాయకులు మారవచ్చు. సమీకరణాలు మారవచ్చు. రాజకీయ అవసరాలు కూడా మారవచ్చు. కానీ కార్యకర్త గుండెల్లో ఉన్న విశ్వాసం దెబ్బతింటే దాన్ని తిరిగి సంపాదించడం చాలా కష్టం. అందుకే స్థానిక రాజకీయాల్లో ఏర్పడుతున్న ప్రతి కొత్త సమీకరణను నాయకత్వం జాగ్రత్తగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అధికారాన్ని విస్తరించడం ఎంత ముఖ్యమో, పార్టీని నిలబెట్టిన కార్యకర్తను గౌరవించడం కూడా అంతే ముఖ్యం. రాజకీయాల్లో వ్యూహాలు గెలుపును అందించవచ్చు. కానీ దీర్ఘకాల విజయాన్ని నిర్ణయించేది కార్యకర్త నమ్మకమే. అదే ఏ పార్టీకైనా అసలైన బలం. అదే భవిష్యత్తు రాజకీయాల దిశను నిర్ణయించే అత్యంత కీలక అంశం.

## కలిసిపోతున్న నేతలు.. ప్రయోజనాలే పరమావధి

## డబ్బుల లెక్కలే... రాజకీయాల్లో మారుతున్న ట్రెండ్

**ఒకప్పుడు ఒకే వేదికపై కనిపిస్తే రాజకీయ భూకంపమే అనుకునే నాయకులు... ఇప్పుడు ఒకే టేబుల్ దగ్గర కూర్చుంటే ఎవరూ ఆశ్చర్యపడటం లేదు. సభల్లో మాటల తూటాలు పేల్చిన వారు... తెర వెనుక మాత్రం చిరునవ్వులు పంచుకుంటున్నారనే భావన ప్రజల్లో బలపడుతోంది. కార్యకర్తలు మాత్రం ఇప్పటికీ పాత యుద్ధాల గాయాలనే మోస్తున్నారు. నాయకులు చేతులు కలుపుతున్నారు... కానీ కిందిస్థాయి కార్యకర్తలు ఇంకా ఒకరినొకరు శత్రువులుగానే చూస్తున్నారు. ఇదే నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల విచిత్ర చిత్రం. జెండాలు వేరు... అడుగులు ఒక్కటేనా? వేదికలపై విమర్శలు... గదులలో వ్యూహాలా? ప్రజల ముందున్న రాజకీయ నాటకానికి, తెర వెనుక జరిగే రాజకీయ ఒప్పందాలకు మధ్య ఉన్న గీత రోజురోజుకీ మసకబారుతోందనే చర్చ వినిపిస్తోంది. అధికారం కోసం సమీకరణాలు మారడం రాజకీయాల్లో కొత్త విషయం కాదు. కానీ సిద్ధాంతాలు, నినాదాలు, కార్యకర్తల త్యాగాలు ఒక్క క్షణంలో పక్కకు వెళ్లిపోతే ప్రశ్నలు మాత్రం తప్పవు. చివరకు గెలిచేది నాయకుల వ్యూహమా? లేక నమ్మకంతో పార్టీని మోసిన కార్యకర్తనా? ఈ సందిగ్ధమే ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అతిపెద్ద చర్చగా మారింది. ప్రజలు చూస్తున్నారు... కార్యకర్తలు గమనిస్తున్నారు... చరిత్ర మాత్రం నిశ్శబ్దంగా ప్రతి అడుగును నమోదు చేస్తోంది.**

### • నాయకుడు బతికితే చాలు... పార్టీ బతుకుతుందా?

రాజకీయాల్లో ఇప్పుడు సిద్ధాంతాల కంటే సీటు విలువ పెరిగిందనే విమర్శ తరచూ వినిపిస్తోంది. గెలిచే అవకాశం ఎక్కడ కనిపిస్తే అక్కడికి వెళ్లడం కొందరు నాయకులకు వ్యూహంగా మారింది. ఒకప్పుడు తీవ్రంగా విమర్శించిన పార్టీనే కొద్దికాలానికే "ప్రజల ప్రయోజనం" పేరుతో ప్రశంసించడం కూడా కొత్త దృశ్యం కాదు. పార్టీలు మారుతున్నాయి. జెండాలు మారుతున్నాయి. మాటలు మారుతున్నాయి. కానీ మారని వారు ఒక్కరే... కార్యకర్తలు. వారు మాత్రం పాత నినాదాలనే నమ్మి పోరాడుతూనే ఉంటారు. నాయకుడు తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి పార్టీని మార్చుకోవచ్చు. కానీ అతనితో పాటు వెళ్లేది వ్యక్తిగత ప్రభావమే తప్ప, కార్యకర్త గుండెల్లోని నమ్మకం కాదు. ఒక నాయకుడు వెళ్లిపోతే మరో పార్టీ బలపడవచ్చు. అదే సమయంలో అతడు వదిలి వచ్చిన పార్టీ లోపల నుంచి బలహీనపడే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలా వ్యక్తిగత రాజకీయ లాభాల కోసం జరిగే వలసలు చివరికి పార్టీల సిద్ధాంతాలను ఖాళీ చేస్తాయి. కార్యకర్తల త్యాగాల విలువను తగ్గిస్తాయి. ప్రజల్లో రాజకీయాలపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. చరిత్ర చెబుతున్న ఒక నిజం మాత్రం ఎప్పటికీ మారదు. పార్టీని ఎన్నికల సమయంలో నాయకుడు నడిపించవచ్చు. కానీ పార్టీని తరతరాల పాటు నిలబెట్టేది కార్యకర్తే. అతని విశ్వాసం కూలిపోయిన రోజు... ఏ పార్టీకైనా అసలు సంక్షోభం అప్పుడే మొదలవుతుంది.

### ● పగలు ఫైర్... రాత్రికి ఫ్రెండ్షిప్!

పొద్దున సభల్లో మాటల తూటాలు పేల్చిన నాయకులు... సాయంత్రానికి ఒకే టేబుల్ దగ్గర కనిపిస్తున్నారనే చర్చ. గందరగోళంలో పడింది మాత్రం కార్యకర్తే... అసలు శత్రువు ఎవరో, మిత్రుడు ఎవరో అర్థంకాని పరిస్థితి.

### ● జెండా పసుపే... ముఖాలు మాత్రం పాతవే!

పార్టీ కార్యాలయం బయట రంగు మారింది. లోపల కూర్చున్నవారిని చూస్తే నిన్నటి రాజకీయాలే గుర్తొస్తున్నాయంటూ కార్యకర్తలు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

### ● కొట్టుకున్నది కార్యకర్త... కౌగిలించుకున్నది నాయకుడు!

ఐదేళ్లు వీధుల్లో పోరాడింది కిందిస్థాయి శ్రేణులు. అధికారం వచ్చాక చేతులు కలుపుతున్నది నాయకత్వమా? అనే ప్రశ్న ఇప్పుడు గ్రామ స్థాయి చర్చల్లో ఎక్కువగా వినిపిస్తోంది.

### ● పోలింగ్ బూత్‌కు వెళ్లేది నినాదం కాదు!

సెల్ఫీలు, సభలు, సమీకరణాలు ఎన్నికలు గెలిపించవు. చివరికి ఓటరిని బూత్ వరకు తీసుకెళ్లేది కార్యకర్తే. అతని మనసు విరిగితే గోడలపై పసుపు రంగు కనిపించినా... బ్యాలెట్‌లో అదే రంగు కనిపిస్తుందనే హామీ లేదంటున్నారు రాజకీయ పరిశీలకులు.



# కోట్ల కోసం డాలర్ డ్రీమ్..
# అమెరికా మోజుతో..



# యూత్ డేంజర్ గేమ్

## పద్మవ్యూహంలో అభిమన్యులు

**ఆధునిక అమెరికా జీవితం భాగం 2**

A for అప్పు చదువు
ME for మేము
RI for రీపే చేయడానికి
CA for కష్టపడుతున్నాం పార్ట్ టైమ్ జాబ్స్‌తో



### మాస్టర్స్ డిగ్రీ ఇప్పుడు ఒక ఫండింగ్ లేని ప్రయాణం

వ్యూహంలోకి అడుగుపెట్టే ముందు అందరూ ఒకేలా ఉండరు. కొందరికి అడ్మిషన్ తో యూనివర్సిటీ ఫండింగ్, లేనివారికి మన బ్యాంక్స్ ఫండింగ్. ఫ్లైట్ ఎక్కకముందు మొదలయ్యే ఒక చర్చ ఉంది "నీకు ఫండింగో, రీసెర్చో ఉందా?" అని. డబ్బున్నవాళ్ళకి ఈ ప్రశ్నే రాదు. వాళ్ళకి దారి తెలుసు. ఈ కథ మిగిలినవాళ్ళది – లోయర్ మిడిల్ క్లాస్ నుంచి అప్పర్ మిడిల్ క్లాస్ దాకా, ఎన్నో ఆశలతో వ్యూహంలోకి దూకినవాళ్ళది. ఎన్నో ఆశలలో ఒకప్పుడు ఈ దూకుడుకి ఒక ప్లాన్ ఉండేది. బీటెక్ చదివేటప్పుడు కొందరు ముందుచూపుతో ఆలోచించేవాళ్లు. ఏ యూనివర్సిటీలో ఏ ప్రొఫెసర్ దగ్గర రీసెర్చ్ ఉంది (RA), ఏ డిపార్ట్మెంట్లో టీచింగ్ అసిస్టెంటిషిప్ (TA), గ్రాడ్యుయేట్ అసిస్టెంటిషిప్ (GA) ఆప్షన్ ఉంది అని వెతికి, ఆ యూనివర్సిటీలకే అప్లై చేసి, అప్పు లేకుండా చదువు పూర్తి చేసుకునేవాళ్ళు. 2013 వరకూ ఫండింగ్, రీసెర్చ్ అసిస్టెంట్అప్ దొరకడం ఇంత కష్టం కాదు - మంచి స్కోర్, మంచి ప్రొఫైల్ ఉంటే యూనివర్సిటీయే ఫండింగ్ ఇచ్చేది. 2015 వరకూ కూడా చర్చలు ఎక్కువగా ఫండింగ్ ఎలా తెచ్చుకోవాలి... రీసెర్చ్ పొజిషన్ ఎలా సంపాదించాలి అనే దాని చుట్టూనే తిరిగేవి. "నాకు కావాలి" అనుకోవడం వేరు, "ఎలా సాధించాలి" అనుకోవడం వేరు -ఆ తరం రెండోదాన్నే ఫాలో అయ్యింది. ఇప్పుడు ఆ దారి ఇంకా ఇరుకైపోయింది. మొత్తం ఇంటర్నేషనల్ మాస్టర్స్ స్టూడెంట్స్‌లో కేవలం 10% మందికే TA/RA/GA ఫండింగ్ దొరుకుతుంది. మిగతా 90% విద్యార్థులు education loanతో వస్తున్నారు. కానీ గత పదేళ్ళుగా ఆ చర్చే మారిపోయింది. ఇప్పుడు మాట్లాడుకునేది పార్ట్ టైమ్ జాబ్ గురించే అంతా. ఎక్కడ దొరుకుతుంది, ఎంత పే చేస్తారు అని. ఇదే మార్పు మిగతా జీవితంలో కూడా కనిపిస్తుంది - సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, బైక్, కార్, ఇవన్నీ ఇప్పుడు అవసరం ఉండి కొనేవి కావు. అందరికీ ఉన్నాయి కాబట్టి నాకూ కావాలి అనుకునేవే. అదే మనస్తత్వం చదువు మీదకీ పాకింది. "ఎలా ఫండింగ్‌తో చదవాలి" అని ఆలోచించే బదులు, "ఎలాగైనా అబ్రాడ్ వెళ్ళిపోయి పార్ట్ టైమ్ చేసుకుంటా చదువుతా" అనే ధోరణి వచ్చేసింది. తల్లిదండ్రులు కూడా ఆలోచించాలి. "బాగా చదువు ఫండింగ్ ఉన్న యూనివర్సిటీకే అప్లై చేసి ఫండింగ్ తెచ్చుకో"లోన్ తీసుకుని వెళ్తానంటే బ్యాంకు మొదటి ప్రశ్న - "నీ ప్రాపర్టీ ఏం సెక్యూరిటీగా పెడతావ్" అని. ప్రాపర్టీ లేకపోతే లోన్ లేదు.



### అప్పు చేసి పిజ్జా కూడు

పెద్దలు ఒకప్పుడు "అప్పు చేసి పప్పు కూడు" అనేవారు కనీసం అవసరం కోసమైనా అప్పు చేయమని. ఇప్పుడు అది "అప్పు చేసి పిజ్జా కూడు"గా మారింది. అవసరం కోసం కాదు, కోరిక కోసం అప్పు. ఇండియాలో ఉన్నప్పుడు టిఫిన్లో ఏం తింటావ్ అని అడిగితే చెప్పేది దోశ, పూరీ, చపాతీ, పరోటా అని - ఉప్మా పెడితే ఎవడూ తినడు. అదే ఇక్కడికి వచ్చాక ఉప్మానే మహా ప్రసాదంలా తింటున్న వాళ్ళు ఎందరో. ఇక్కడే అసలు లెక్క తేలుతుంది. కనీసం ఇండియాలో కొన్నాళ్లు ఉద్యోగం చేసి, సేవింగ్స్‌తో ఫీజు కట్టుకోవడమే మెరుగు. లేదంటే ఎడ్యుకేషన్ లోన్ తీర్చడానికి, జాబ్ వచ్చాక కూడా ఇంకో రెండుమూడేళ్ళు పడుతుంది. అంటే మొత్తం అయిదేళ్ళ కాలం అప్పు తీర్చడానికే వృథా అవుతుంది. చదువుకి రెండేళ్ళు, జాబ్ దొరికాక అప్పు తీర్చడానికి ఇంకో రెండుమూడేళ్ళు. బతుకు మొదలుపెట్టేలోపే, బతుకులో సగం అప్పు కోసమే ఖర్చైపోతుంది. 40 నుంచి 50 లక్షలు అప్పు చేసి, ఇంత కష్టపడి పార్ట్ టైమ్ చేసుకుంటూ బతికినా, చివరికి జాబ్ వస్తుందన్న గ్యారెంటీ ఏమీ లేదు. ఇంత రిస్క్ తీసుకుని, ఇంత వడ్డీ కట్టి, ఫలితం గ్యారంటీ లేని ఈ డీల్ చూస్తే ఒక సినిమా డైలాగ్ గుర్తొస్తుంది - జల్సా మూవీలో "అదే డబ్బుని నాకు ఇస్తే నెలకి వడ్డీకి తిప్పి వాడికన్నా ఎక్కువ సంపాదిస్తా". ఇంత పెద్ద అప్పు, ఏం జరుగుతుందో తెలియని బతుకు వెరసి ఇది పెట్టుబడి కాదు, జూదం.' దిగిన వెంటనే మొదటి పోరాటం పార్ట్ టైమ్ కోసం. రెస్టారెంట్లో, పెట్రోల్ బంక్లో, స్పా సెంటర్లో, మాల్స్‌లో ఎక్కడ చదివినా, ఏం చదివినా, తర్వాతి పార్ట్ టైమ్ కూడా "పరిచయాలు" మీదే ఆధారపడుతుంది. "పార్ట్ టైమ్ చేస్తున్నాడు, మా వాడు" అక్కడ అని చెప్పేముందు నిజం ఏంటో అర్థం చేసుకోవాలి అది పార్ట్ టైమ్ కాదు, ఇల్లీగల్ జాబ్. పేరోల్ మీద కాకుండా, క్యాష్ తీసుకుని చేసే పని ఏదైనా చట్టప్రకారం ఇల్లీగలే. దొరికితే దొంగ, దొరకని అంతవరకూ దొర - ఇదే ఈ బతుకు నియమం. కానీ ఇది వాళ్ళ తప్పు కాదు లీగల్ గా పని దొరకని చోట, బతకడానికి ఇల్లీగల్‌గానైనా పని చేయక తప్పదు. ఒకప్పుడు చదివిన వాళ్ళకి ఉద్యోగాలు లేక నక్సలిజం పుట్టింది. అదే శూన్యం నుంచి పుట్టింది ఇల్లీగల్ పార్ట్ టైమ్ వ్యవస్థ. రూపం వేరు, కారణం ఒక్కటే.

### కమిషన్ కోసం అమ్ముడుపోయే భవిష్యత్తు

వ్యూహంలోకి తీసుకెళ్ళే మొదటి అడుగే అబద్ధం మీద నడుస్తుంది. ఇండియాలో చాలా ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలు అమెరికాలోని మిడ్‌టయర్, తక్కువ ర్యాంక్ ప్రైవేట్ యూనివర్సిటీలతో టైఅప్ అయి, ప్రతిభ ఉన్న విద్యార్థులని కూడా చెత్త యూనివర్సిటీలకే పంపిస్తాయి. ఏ యూనివర్సిటీలో వీసా అప్రూవల్ రేటు ఎక్కువో అదే గుడ్డిగా నమ్మి, స్టూడెంట్స్ ని విమానం ఎక్కేస్తారు స్కోర్ ఎంతో, ప్రతిభ ఎంతో పట్టించుకోకుండా. కారణం సింపుల్ - డబ్బు. ఒక కన్సల్టెన్సీ ఒక స్టూడెంట్ని ఒక యూనివర్సిటీలో ప్లేస్ చేస్తే, ఆ యూనివర్సిటీ కన్సల్టెన్సీకి కమిషన్గా చెల్లించేది సాధారణంగా మొదటి సంవత్సరం ట్యూషన్ ఫీజులో 10 నుంచి 15% (కొన్నిసార్లు 20% దాకా). ₹20 నుంచి 30 లక్షల ప్రోగ్రామ్ అయితే, ఒక్క స్టూడెంట్ నుంచి కన్సల్టెన్సీకి ₹2 నుంచి 3 లక్షలు వస్తాయి. ఒక చండీగఢ్ ఫర్మ్ ఏడాదికి 200 నుంచి 200 మంది స్టూడెంట్స్‌ను పంపి ₹6 కోట్లకు పైగా సంపాదిస్తోంది. ఒక ఉద్యోగి స్వయంగా ఒప్పుకున్నట్టు, "ఎక్కువ కమిషన్ ఇచ్చే యూనివర్సిటీలకే మేం స్టూడెంట్స్‌ని పంపిస్తాం". టాప్ యూనివర్సిటీలు ఏజెంట్లకి కమిషన్ ఇవ్వవు కాబట్టి, అవి ఈ లిస్టులోకి రావు. ప్రతిభ ఉన్నా, కమిషన్ లేని చోటికి దారి చూపించరు. 73% మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదవడానికి ఏజెంట్ లేదా కన్సల్టెన్సీ ద్వారానే వెళ్తున్నారు. 2024లో భారతీయ కుటుంబాలు విదేశీ చదువుల కోసం $38 బిలియన్లు ఖర్చు పెట్టాయి. 2029 నాటికి ఇది $58 బిలియన్లకు చేరుతుందని అంచనా. వ్యూహంలోకి తీసుకెళ్ళే గేట్కీపర్లే, తమ కమిషన్ కోసం, విద్యార్థి భవిష్యత్తుని అమ్మేస్తున్నారు. స్టూడెంటికి ఏది మంచిదో కాదు, తమకి ఏది లాభమో అదే చెప్తారు, చేస్తారు. అమెరికాకి కావాల్సింది మన డబ్బు. అడ్మిషన్ ఇచ్చేస్తే, ఆ యూనివర్సిటీకి ఒక ఫిక్సిడ్ పేమెంట్‌గా ఆదాయం వచ్చేస్తుంది. స్టూడెంట్ భవిష్యత్తుతో వాళ్ళకి పనిలేదు. 2000 సంవత్సరంలో మన దగ్గర ఇంజనీరింగ్ కాలేజీలు చాలా తక్కువ ఉండేవి, ఆ తర్వాత ఒక్కో ఊళ్ళో మూడు, నాలుగు కాలేజీలు పుట్టుకొచ్చాయి. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ లాంటి నగరాల్లో ఆర్టీసీ బస్సుల కంటే ఇంజనీరింగ్ కాలేజీ బస్సులే ఎక్కువ కనిపించే పరిస్థితి వచ్చింది. ఇండియాలో పుట్టుకొచ్చినట్టే, అమెరికాలో కూడా ఇలాంటి ప్యారలల్ యూనివర్సిటీలు పుట్టుకొచ్చాయి ఫీజు వసూలు చేయడమే పని, అవుట్‌కమ్‌తో సంబంధం లేదు. 100 యూనివర్సిటీలు తీసుకుంటే, అందులో 5% కంటే తక్కువ చోట్లే క్యాంపస్ జాబ్ డ్రైవ్‌లు జరుగుతాయి. "ఇక్కడ ప్రాక్టికల్‌గా నేర్పిస్తారు, ఇండియాలో అంతా పుస్తకాలే" అనుకుంటే అది పూర్తిగా తప్పు ప్రాక్టికల్‌గా నిజంగా నేర్పే యూనివర్సిటీలు ఇక్కడ కూడా చాలా తక్కువే. "ఎలాగైనా అమెరికా వెళ్ళిపోవాలి" అనుకునే స్టూడెంట్స్‌కి, "మిమ్మల్ని ఎలాగైనా పంపిస్తాం" అనే కన్సల్టెన్సీలు తగులుతాయి. కన్సల్టెన్సీలు మనకి ఏ మేలూ చేయట్లేదు అని అర్థం చేసుకోవాలి - వాళ్ళు వాళ్ళ వ్యాపారం చేసుకుంటున్నారు, అంతే.

### కులం అనే మరో వ్యూహం

అమెరికాలో అడుగు పెట్టిన మరుక్షణమే మరో వ్యూహం మొదలవుతుంది - ఈసారి ఆయుధాలు కులం, రాజకీయ పార్టీ. కొత్తగా వచ్చిన విద్యార్థులని కొందరు మొదటి ప్రశ్న అడుగుతారు. నువ్వు ఏ కులం, ఏ పార్టీ అని. కలిసి పని చేసేవాడిని, కొత్తగా పరిచయమైన వాడిని కూడా వదలరు. మాది తెలంగాణ అంటే, వాడి జోలికి రారు. తెలంగాణ అంతా ఒక కుటుంబం కింద ఉంటారు, ఆంధ్ర జనాలు గోడలు కట్టుకుని వేరు వేరుగా ఇక్కడ ఉంటారు. బతుకుదెరువు కోసం ఇంత దూరం వచ్చి, ఇక్కడ కూడా అదే గోల మోసుకొచ్చాం. TATA BATA AATA పార్టీ మీటింగుల్లో, సభల్లో, కుల పరిచయ వేదికల్లో, పెళ్లి చూపుల్లో, తమ కులం వాడి సినిమా రిలీజైతే థియేటర్లో చేసే పంతంలో - అమెరికా అంతా ఈ వ్యూహం మెల్లగా అల్లుకుపోయింది. ఏ కోణంలో చూసినా, తెలంగాణ ఉద్యమం ఎంత నిజమో, ఇక్కడి కుల రాజకీయం అంతే నిజం. ఒకటి గడ్డ మీద పుట్టింది, రెండోది సముద్రం దాటి వచ్చింది - తేడా అంతే. అభిమన్యుడు వ్యూహంలో ఒంటరిగా చిక్కుకున్నాడు. మనం మాత్రం ఈ వ్యూహాన్ని సొంతంగా మోసుకొచ్చి, పిల్లలకి కూడా వారసత్వంగా అప్పజెప్పుతున్నాం. ఎవరో బలవంతం చేయలేదు, మనమే మోసుకొచ్చాం. ఈ ప్రశ్న ఎవరిని అడిగినా, ఎవరు అడగకపోయినా ఒక్క సంగతి మాత్రం నిజం. వ్యూహంలో చిక్కుకున్నవాడికి శత్రువు ఎప్పుడూ బయట ఉండడు, చాలాసార్లు వాడి పక్కనే, వాడి భాషే మాట్లాడుతూ ఉంటాడు.

విద్యార్థుల మధ్య కూడా ఇదే వ్యూహం కనిపిస్తుంది. కొన్నిసార్లు రూమ్ కావాలన్నా, పార్ట్ టైమ్ జాబ్ రిఫరెన్స్ కావాలన్నా - ముందు కులం గుర్తింపు చూస్తారు. ఆ తర్వాతే సాయం. మరో మాట కూడా చెప్పుకోవాలి. ఈ వేరు వేరుగా చూడం చూసి ఎంతమంది ఆంధ్ర యువత "తెలంగాణలో పుట్టి ఉంటే బాగుండేది" అని ఒక్కసారైనా అనుకున్నారో లెక్క లేదు అవకాశాల్లో ఏదో ఒక అంచున నిలబడి, తమది కాని నేల మీద తామే పరాయివాళ్ళయిన భావన కొందరికి మిగిలింది. నిజం చెప్పాలంటే, ఈ గీత మనం అమెరికాకి తీసుకెళ్ళేది కాదు - అది ఇక్కడే మనలో నాటుకుపోయింది. చిన్నప్పటి నుంచే మనం కులం అనే గుర్తింపుతో పెరుగుతాం. స్కూల్లో, హాస్టల్లో, కాలేజీల్లో ఎక్కడో ఒకచోట ఈ గీత తగులుతూనే ఉంటుంది. ఇది వ్యవస్థ మీద చర్చ కాదు... ఇది మన మనస్తత్వం మీద చర్చ. సమాజం మనకి ఈ గుర్తింపుని ఎంత గట్టిగా అలవాటు చేసిందంటే, అమెరికా వచ్చినా ఈ అలవాటు పోదు. పేపర్ మీద ఏమీ నింపక్కర్లేదు, కానీ ఎక్కడో బుర్రలో ఇది నాటుకుపోయింది. దాసరి నారాయణరావు సినిమాలో, మీ పేరు చివరిలో ఆ తోక ఎందుకు అని పాడితే దేనికో అనుకున్నారు. ఇండియాలో చాలామందికి సర్టిఫికెట్ మీద లేని ఆ "తోక", ఇక్కడికి వచ్చిన కొంతకాలానికి మిగిలిన వాళ్ళు అంటించడం వల్ల ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ అకౌంట్లలో తోక వచ్చేస్తుంది. ఎందుకంటే గోడలు కూలగొట్టడం కంటే, గోడల వెనుక దాక్కోవడమే మనకి బాగా అలవాటైన పని.

### వడ్డీ లెక్క, నిశ్శబ్దం

వ్యూహం లోపల ఆయుధాలే కాదు, అప్పులు కూడా వెంటాడతాయి. ఇండియాలో చదువుకోవడానికి 40 నుంచి 50 లక్షల లోన్ కావాలంటే, హౌసింగ్ లోన్ కన్నా ఎడ్యుకేషన్ లోన్‌కే వడ్డీ ఎక్కువ. 10 నుంచి 13% వరకూ ఉంది. ఇల్లు కొనడానికన్నా చదువుకోవడానికి రిస్క్ ఎక్కువ అని బ్యాంకులు ఎందుకు అనుకుంటాయో ఎవరూ అడగరు. పైగా ఆ లోన్ కావాలంటే ప్రాపర్టీ పెట్టందే బ్యాంకులు ఇవ్వవు. ఈ వడ్డీ రేట్ల గురించి ఏ సభలోనూ, ఏ పార్లమెంట్ సమావేశంలోనూ ఒక్క నాయకుడు నోరు విప్పడు. కారణం అమెరికా వచ్చాక ఎలక్షన్ టైంలో ఓటు వేయడానికి ఎవరూ ఇండియా వెళ్ళరు. వ్యూహంలో చిక్కుకున్నవాడు నాయకుల లెక్కలోకి రాడు, కాబట్టి వాళ్ళూ మనకి ఉపయోగపడరు. ఇదే రాజకీయం.

**- ఫణి కిషోర్ (పీకే) అమెరికా**







# బాబర్‌కు మళ్లీ సారథ్యం

### టెస్టు జట్టు కెప్టెన్‌గా మళ్లీ బాధ్యతలు

పాకిస్థాన్ టెస్టు జట్టుకు బాబర్ ఆజమ్ మరోసారి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఇటీవల షాన్ మసూద్ స్థానంలో ఆయనను ఎంపిక చేసిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌తో బాబర్ రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. గతంలో టెస్టు కెప్టెన్‌గా బాబర్ జట్టును విజయవంతంగా నడిపించిన అనుభవాన్ని మరోసారి వినియోగించుకోవాలని బోర్డు భావిస్తోంది. కెప్టెన్సీపై తనకు ఎలాంటి ఒత్తిడి లేదని బాబర్ ఆజమ్ స్పష్టం చేశాడు. గతంలో కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం తనకు ఎన్నో పాఠాలు నేర్పిందని చెప్పాడు. పాకిస్థాన్ విజయమే తన ఏకైక లక్ష్యమని, ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టేలా సరైన నిర్ణయాలు తీసుకుంటానని వెల్లడించాడు.

### మసూద్‌కు నిరాశ

షాన్ మసూద్ నాయకత్వంలో పాకిస్థాన్ 16 టెస్టుల్లో 12 పరాజయాలు చవిచూసింది. జట్టు ఆశించిన ఫలితాలు రాకపోవడంతో సెలక్షన్ కమిటీ నాయకత్వ మార్పుకు నిర్ణయం తీసుకుంది. గతంలో బాబర్ సారథ్యంలో పాకిస్థాన్ దక్షిణాఫ్రికాపై 20తో సిరీస్ గెలవడంతో పాటు బంగ్లాదేశ్, శ్రీలంకలోనూ విజయాలు సాధించింది. ఇప్పుడు అదే విజయపథంలో జట్టును నడిపిస్తాడనే నమ్మకంతో మళ్లీ బాబర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు.

# జింబాబ్వేపై భారత్ జైత్రయాత్ర

### అయ్యర్‌కు తొలి సిరీస్ విజయం

హరారే వేదికగా జరిగిన రెండో టీ20లో భారత్ 90 పరుగుల భారీ తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 20తో కైవసం చేసుకుని మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకుంది. కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది తొలి టీ20 సిరీస్ విజయం కావడం విశేషం. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 81 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, తిలక్ వర్మ 60 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇద్దరూ నాలుగో వికెట్‌కు 94 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. 220 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు బ్రియాన్ బెన్నెట్ 19 బంతుల్లో 32 పరుగులతో శుభారంభం ఇచ్చాడు. తర్వాత భారత బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని 17.5 ఓవర్లలో 129 పరుగులకే ఆలౌట్ చేశారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టి ప్రదర్శనతో భారత్ మరో ఘన విజయాన్ని నమోదు చేసింది.





# ఇషాన్ విధ్వంసం.. భారత్ ఘన విజయం

జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో 81 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఇషాన్ కిషన్, తాను చాలా సరళంగా ఆడానని చెప్పాడు. ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయినా ఒత్తిడికి గురికాకుండా తన ఆటతీరుపై నమ్మకం ఉంచి పరిస్థితికి తగ్గట్టు బ్యాటింగ్ చేశానని వెల్లడించాడు. 44 బంతుల్లో 81 పరుగులు చేసిన ఇషాన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అనంతరం తిలక్ వర్మతో కలిసి 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌ను 219 పరుగుల భారీ స్కోరుకు చేర్చాడు. ఈ ప్రదర్శనకు అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. భారత యువ పేసర్లు మయాంక్ యాదవ్, యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్ అద్భుతంగా రాణిస్తున్నారని ఇషాన్ ప్రశంసించాడు. వారి కృషి, శ్రమ త్వరలోనే భారత క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెడుతుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. బ్యాటర్లు, బౌలర్ల సమష్టి ప్రదర్శనతో భారత్ 90 పరుగుల తేడాతో విజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 20తో కైవసం చేసుకుంది.

# అందువల్లే ఓడిపోయాం

- తిరిగి పుంజుకుంటాం
- జింబాబ్వే కెప్టెన్ రజా

జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత్ చేతిలో 90 పరుగుల తేడాతో ఓటమి పాలైన తర్వాత కెప్టెన్ సికందర్ రజా తన జట్టు ప్రదర్శనపై నిరాశ వ్యక్తం చేశాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో చేసిన తప్పిదాలే ఓటమికి ప్రధాన కారణమని అంగీకరించాడు. భారత్ అద్భుతంగా ఆడిందని, వారి నైపుణ్యం ప్రశంసనీయమని పేర్కొన్నాడు. భారత్ నిర్దేశించిన 220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు మంచి ఆరంభం ఇచ్చినా, అనుభవలేమి, తప్పు షాట్ ఎంపిక జట్టును దెబ్బతీశాయని రజా చెప్పాడు. ఫీల్డింగ్ మరింత మెరుగైతే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ అద్భుత బ్యాటింగ్ చేశారని ప్రశంసించిన రజా, వారి ఆట నుంచి తమ జట్టు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నాడు. కెప్టెన్‌గా తన బ్యాటింగ్ కూడా ఆశించిన స్థాయిలో లేదని అంగీకరించాడు. గత రెండు టీ20ల్లో జట్టుకు అవసరమైన పరుగులు చేయలేకపోయానని, తర్వాతి మ్యాచ్‌లో తప్పక మెరుగైన ప్రదర్శన ఇస్తానని విశ్వాసం వ్యక్తం చేశాడు.





# సక్సెస్ టాక్‌లో చెన్నై లవ్ స్టోరీ

టాలీవుడ్‌లో తాజాగా విడుదలైన ప్రేమకథా చిత్రాల్లో 'చెన్నై లవ్ స్టోరీ' ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, నటి శ్రీ గౌరీ ప్రియా జంటగా నటించిన ఈ చిత్రానికి దర్శకుడు రవి నంబూరి దర్శకత్వం వహించారు. జాతీయ అవార్డు గ్రహీత సాయి రాజేష్ అందించిన కథతో తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పరుచుకోగా, ప్రీమియర్ షోల నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను అందుకుంది. ముఖ్యంగా కిరణ్ అబ్బవరం నటన, శ్రీ గౌరీ ప్రియా సహజమైన అభినయం, భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో విడుదలైన మొదటి రోజే 1.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం విశేషంగా మారింది. విడుదల రోజునే ఇంత భారీ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం సినిమా క్రేజ్‌ను ప్రతిబింబిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, నేపథ్య సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భావోద్వేగ సన్నివేశాలను మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన సంగీతం కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. తొలి రోజు స్పందనను బట్టి చూస్తే, 'చెన్నై లవ్ స్టోరీ' కిరణ్ అబ్బవరం కెరీర్‌లో మరో విజయవంతమైన చిత్రంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'చెన్నై లవ్ స్టోరీ' చిత్ర బృందం నిర్వహించిన సక్సెస్ మీట్ లో సిబ్బంది మాటలు హైలైట్‌గా నిలిచాయి. హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ, నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, ఎస్‌కేఎన్ తమ అనుభవాలను పంచుకుంటూ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ.. తన జీవితంలో ఇది ఎంతో ప్రత్యేకమైన విజయమని చెప్పారు. సినిమా విడుదలైనప్పటి నుంచి తన ఫోన్ నిరంతరం మోగుతూనే ఉందని, చాలామంది మీ అమ్మ ఉండి ఉంటే చాలా సంతోషించేదని చెబుతున్నారని వెల్లడించారు. అయితే తన అమ్మ ఎక్కడ ఉన్నా తన విజయాన్ని చూస్తూనే ఉంటుందని తాను నమ్ముతున్నానని ఆమె ఎమోషన్ అయ్యారు. ఒక తెలుగు అమ్మాయిగా కంటెంట్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ.. సంగీత దర్శకుడు మణిశర్మ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రాణం పోశాయని చెప్పారు. అనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం కూడా చిత్రానికి మరో బలమైందన్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని వయసుల మహిళలు సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారని వెల్లడించారు. గౌరీ ప్రియ పాత్ర కోసం ప్రాణం పెట్టి నటించిందని, అందుకే ఇప్పుడు ఆమెకు అంతటి ప్రశంసలు వస్తున్నాయని చెప్పారు. హీరో కిరణ్ అబ్బవరాన్ని నిజమైన నిర్మాతల హీరోగా అభివర్ణిస్తూ, షూటింగ్ విషయంలో ఎప్పుడూ సహకరించారని వెల్లడించారు.

# అలాంటి రోల్ ఉంటే చేస్తా

## నిధి అగర్వాల్

సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ అన్నారు. 'ఈశ్వరన', 'భూమి', 'కళగ తలైవన' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు. మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు, 'ది రాజా సాబ' సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదని నిధి తెలిపారు. ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ' పార్ట్`2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర'లో కనిపించనున్నారు.





# మెగా 158లో డాక్టర్ భద్రం కీలక రోల్

- చిరును కలిసి కృతజ్ఞతలు తెలిపిన సోము వీర్రాజు

మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారనే విషయం మరోసారి చర్చనీయాంశమైంది. దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం మెగా 158 లో ప్రముఖ హాస్యనటుడు డాక్టర్ భద్రంకు కీలక పాత్ర దక్కడం ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్వయంగా చిరంజీవిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.డాక్టర్ భద్రం తన అల్లుడు కావడంతో, ఆయనకు ఇలాంటి మంచి అవకాశం కల్పించినందుకు చిరంజీవికి వ్యక్తిగతంగా ధన్యవాదాలు తెలిపినట్లు సోము వీర్రాజు వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వివరాలను సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# సౌండ్ ఇంజనీర్‌గా నారా రోహిత్



కథానాయకుడు నారా రోహిత్ జోరుమీదున్నారు. ఒకప్పుడు వైవిధ్యమైన కథలు, పాత్రలు ఎంచుకుని అలరించేవారు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే ఏదో కొత్తదనం ఉందనే భావన ప్రేక్షకులకు కలిగేది. అయితే, కొంతకాలం విరామం తీసుకున్న నారా రోహిత్ గతేడాది 'భైరవం', 'సుందరకాండ' చిత్రాలతో మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇప్పుడు మరోసారి వరుస చిత్రాలతో అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల కబుర్లు పంచుకుంటున్నారు. రామ్ గన్నీ దర్శకత్వంలో రోహిత్ ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి 'కపాలి' అనే టైటిల్, ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఇది రూపొందుతోంది. ఇక వెంకటేశ్`త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం.47'లోనూ నారా రోహిత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ లుక్‌ను కూడా చిత్ర నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ శనివారం సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో పాటు, చినిమిల్లి మణికుమార్ దర్శకత్వంలో ఓ వైవిధ్యమైన కథలో నారా రోహిత్ మెరవనున్నారు. ఈ సినిమాకు 'సౌండ్ ఇంజినీర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. నయన్‌సారిక, నరేశ్, రోహిణి, అజయ్, వెన్నెల కిషోర్, సుదర్శన్, బ్రహ్మాజీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085